# వైఎస్ఆర్-అన్నమయ్య



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త



సోమవారం 04 నవంబర్ 2024


## మర్యాదపూర్వక కలయిక..

**రాయచోటి, నవంబరు 3, ప్రభాతవార్త:**
అన్నమయ్య జిల్లా మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటికి విచ్చేసిన సందర్భంగా రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు రాయచోటి నియోజకవర్గం టీడీపీ సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు రాయచోటిలోని స్టేట్ గెస్ట్ హౌస్ నందు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



## శ్రీ రామాంజనేయ యుద్ధ నాటక ప్రదర్శణ

**ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 03, ప్రభాతవార్త:**
స్థానిక గీతాశ్రమం వీధిలో ఉన్న ఎరుకలయ్య ఆశ్రమం నందు జరుగుతున్న నామా ఏకరసానంద గిరి స్వామి, కమాలక్షుమ్మ ఆరాధన ఉత్సవాలలో బాగంగా ఆదివారం 4వ రోజు ఎరుకలయ్య స్వామి, కమాలక్షుమ్మ మూలవిరాట్టులకు నిత్యపూజలు, గీతా పారాయణం, అర్చణ, కుంకుమార్చన, ప్రసాద వినియోగం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ రామాంజనేయ యుద్ధ నాటక ప్ర దర్శణ నిర్వహించారు. ఈ సంధర్భంగా పెద్దఎత్తున భక్తులు, స్థానిక ప్రజలు ఆరాధనోత్సవాలలో పాల్గొన్నారు.



### జిల్లా సమగ్రాభివృద్ధికి

# అధికారులు సమన్వయంతో పని చేయాలి

**- రాష్ట్ర రవాణా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**





**రాయచోటి, నవంబరు 3, ప్రభాతవార్త:**
అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఆదివారం రాష్ట్ర రోడ్లు భవనాలు మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖామంత్రి మరియు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమీక్షా కమిటటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ 4 నెలల కొద్ది కాలంలోనే ఏవైతే ప్రజలకు అందాలో మరియు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. వంద రోజుల్లో ఇది మంచి ప్రభుత్వమనే కార్యక్రమంతో వాడవాడలా ప్రజల వద్దకు వెళ్లాం. వారందరూ ఇది ఒక మంచి ప్రభుత్వమని నీరాజనాలు పలికారు. జిల్లాలో సుమారు 65 లక్షల పింఛన్లు ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వం మాదిరి కాకుండా ప్రజలకు ఉచితంగా ఇసుకను అందజేస్తున్నామని తెలిపారు. మొదటి మంత్రివర్గ సమావేశంలోనే నిరుద్యోగుల కోసం డీఎస్సీని ప్రకటించి ప్రజల ప్రభుత్వంగా నిరూపించుకున్నామన్నారు. రాయచోటి నియోజకవర్గంలో వర్షాభావంతో నీటి సమస్యలు ఉన్నాయి. ఆరు మండలాల్లో నీటి సౌకర్యం కోసం అవసరమైన చర్యలు తతీసుకుంటామనపి పేర్కొన్నారు. ఈ జిల్లాలో టమోటా మామిడి ఎక్కువ. ప్రాసెసింగ్ కోల్డ్ స్టోరేజీ యూనిట్లు ఏర్పాటు చేయాలి. హార్టికల్చర్ హబ్‌గా చేయడానికి మీ సూచనలు సలహాలు సహకారం కోరుతున్నాను. లోకేష్‌బాబు నేతృత్వంలో విద్య ఐటీ రంగాల అభివృద్ధి చెందడంతో పాటు రాయలసీమ సస్యశ్యామలం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

### ఇష్టంతో కష్టపడి చదివితే

# లక్ష్యాన్ని చేరుకుంటాం

**ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మయ్య**



**ప్రొద్దుటూరు, నవంబర్ 03, ప్రభాతవార్త:**
ఇష్టంతో కష్టపడి చదివితే ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం సులభతరమని ఢిల్లీలోని డాక్టర్ లక్ష్మయ్య స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మయ్య అన్నారు. ఆదివారం స్థానిక ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఆశీస్సులతో టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు నియోజకవర్గ మహిళా మణులకు సివిల్స్‌లో శిక్షణ ఎంపిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సంధఋంగా మహిళలకు ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విధ్యార్ధి ఎంచుకున్న లక్ష్యంవైపు బలమైన కోరిక శ్రమ సామాజిక సృహ కలిగి ఉండాలని అన్నారు. ఐఏఎస్ సాధనకు 10వ తరగతి, ఇంటర్ మార్కులతో సంబంధం లేదని సామాజిక అవగాహణ సాధారణ ప్రజ్ఞ ఉండి ప్రతిరోజు 10 గంటల నుండి 12గంటల వరకు కష్టపడి చదివితే సివిల్స్ సాధించవచ్చు అని తెలిపారు. అనంతరం సమావేశంలో పాల్గొన్న మహిళల ప్రశ్నలకు సమాధానాలు సివిల్స్‌పై అవగాహణ కల్పించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి మాట్లాడుతూ పోటీ పరీక్షలకు తెలివితేటలతో పాటు సరైన దిశా నిర్దేశం సూచించే గురువులను ఎన్నుకోవడం కూడ ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. డాక్టర్ లక్ష్మయ్య మార్గదర్శకత్వంపై నాకెంతో నమ్మకముందన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో కూడ మహిళలు అత్యున్నత ఐఏఎస్, ఐపీఎస్‌లు కావాలన్నదే తమ ఆకాంక్ష అని ఆయన అభిప్రాయపడ్డారు. విశిష్ట అతిధిగా పాల్గొన్న పులివెందుల ఆర్డీఓ భాను శ్రీ మాట్లాడుతూ సాధించాలనే తపన శ్రమ బలమైన కోరిక సమయపాలన పాటిస్తే లక్ష్యం సాధించడం సులభతరమని అన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రుల ప్రోత్సాహం సరైన కోచింగ్ సెంటర్ లనే ఫ్లాట్‌ఫామ్ గమ్యానికి చేరుస్తాయన్నారు. అందుకు ముందు వరుసలో డాక్టర్ లక్ష్మయ్య స్టడీ సర్కిల్ ఉంటుందని ఆమె పేర్కొన్నారు. తాను 23ఏళ్లకే లక్ష్యం సాధించానంటే డాక్టర్ లక్ష్మయ్య స్టడీ సర్కిల్ కృషి ఉందన్నారు. డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఢిల్లీలో సివిల్స్ శిక్షణకు దాదాపు పది లక్షలు ఖర్చు అవుతుందని సమర్ధత కలిగి స్థోమత లేని విధ్యార్ధులకు ప్రొద్దుటూరు నియోజకవర్గ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఆయన కుమారుడు నంద్యాల కొండారెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ లక్ష్మయ్య స్టడీ సర్కిల్ ద్వారా సివిల్స్ శిక్షణ ఇప్పించడం ప్రశంసించదగ్గ విశయమన్నారు. ఈ అవకాశాన్ని విధ్యార్ధులు సద్వినియోగం చేసుకొని దేశంలోనే అత్యున్నతమైన సివిల్స్ సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు విశ్రాంత వ్యాయామ అధ్యాపకులు కోటా ఓబుళరెడ్డి, గండికోట షేక్‌షా వల్లి, కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్ రెడ్డి, సుమారు వందమంది మహిళలు మరియు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# శబరిమలై వెళ్లే అయ్యప్ప స్వామి భక్తులకు షాక్

- రాజంపేటలో జయంతి ఎక్స్‌ప్రెస్ స్టాపింగ్ ఎత్తివేత
- పేరు గొప్ప..ఊరు దిబ్బ
- ఇప్పటికి రాజంపేటలో స్టాపింగ్ లేని రైళ్లు 21
- ఇలాగైతే కోట్ల రూపాయలు అభివృద్ధికి ఖర్చు ఎందుకు




**రాజంపేట అర్బన్, నవంబర్ 03, ప్రభాతవార్త:**
పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట పరిస్థితి "పేరు గొప్ప ఊరు దిబ్బ" అన్న చందంగా మారింది. ఒకవైపు రాజంపేట రైల్వేస్టేషన్ అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు మంజూరు అవుతున్నాయి. మరో వైపు రోజుకో ట్రైన్ స్టాపింగ్ ఎత్తేస్తున్నారు. తాజాగా శబిరిమల్లె వెళ్లేందుకు 3నెలల పాటు అయ్యప్ప భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉండే జయంతి ఎక్స్‌ప్రెస్(16381,82) స్టాపింగ్‌ను ఈ నెల రెండు నుంచి ఎత్తివేస్తూ దక్షిణ మధ్య రైల్వే ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇప్పటివరకు రాజంపేట మీదుగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు వెలుతున్న స్టాపింగ్‌కు నోచుకోని రైళ్ల సంఖ్య 21కు చేరింది. కరోనా పుణ్యమా అని పలు రైళ్ల స్టాపింగ్‌లు రైల్వే బోర్డు ఎత్తివేయగా దాన్ని అలాగే కొనసాగిస్తున్నారు. రాజంపేట ఎంపీ మిధున్ రెడ్డి ఏనాడు ఏ ఎక్స్‌ప్రెస్ రైలు నిలిపివేసిన స్పందించిన పాపాన పోలేదు. ఫలితంగా రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రంలో ప్రయాణీకులు, అయ్యప్ప భక్తులు జయంతి ఎక్స్‌ప్రెస్ స్టాపింగ్ ఎత్తివేయడం పట్ల భగ్గుమంటున్నారు. నవంబర్ 16 నుంచి జనవరి 15వరకు వందలాది మంది అయ్యప్ప భక్తులు చెంగనూరు వరకు వెళ్లేందుకు రాజంపేట నుంచి రిజర్వేషన్ చేసుకొని ఉన్నారు. అలాగే తిరుగు ప్రయాణంలో కూడ కన్యాకుమారి, త్రివేంద్రం, చెంగనూరు, కొట్టయం స్టేషన్‌ల నుంచి వచ్చేందుకు కూడ వందలాది మంది టిక్కెటు రిజర్వేషన్ చేసుకొని ఉన్నారు. ఈ నేపధ్యంలో రైళు స్టాపింగ్ ఎత్తివేస్తే ఎక్కడికి వెళ్లాలని అయ్యప్ప భక్తులు ప్రశ్నిస్తున్నారు. నవంబర్ 16 నుంచి అయ్యప్ప మండల పూజ మహోత్సవం ప్రారంభం అవుతుంది. ఆ తర్వాత రాజంపేట రైల్వే స్టేషన్ ఎదుట అయ్యప్ప భక్తులు ఆందోళన చేపట్టేందుకు సిద్ధం అవుతున్నారు. ఇకపోతే రాజంపేట మీదుగా వెళుతున్న రైళ్లను చూస్తే ఎవరైన ఆశ్చర్యపోతారు. రాజంపేట పార్లమెంట్ హెడ్ క్వాటర్‌గా ఉండి కూడ ఈ రైళ్లు ఆగలేకపోవడం గమనార్హం.దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లే సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ 12707, 08 రైలు స్టాపింగ్ లేదు. 22179, 80 చెన్నై-ముంబై లోకమాన్యత ఎక్స్‌ప్రెస్ 17313, 14, హుబ్లి-చైన్నె 20953, 54, చెన్నై-అహ్మదాబాద్ 20919, 20, చెన్నై-కాచీగూడ 16351, 51, నాగర్‌కోయిల్-ముంబై ఎక్స్‌ప్రెస్ 12789, 90, 22157, 58 ముంబై, చెన్నై మెయిల్, 17419, 20 తిరుపతి-వాస్కోడిగామ(గోవా), 16733, 34 రామేశ్వరం-ఓకా, 17621, 22 అవరంగబాద్ తిరుపతి, 17415, 16 హరిప్రియ ఎక్స్‌ప్రెస్, 09519, 20 మధురై-ఓకా, 07489, 90, 09419, 20 అహ్మదాబాద్-తిరుచిర పల్లి, 07653, 54 తిరుపతి-కాచిగూడ, 22102, 03 మధురై, ముంబై సూఫర్‌ఫాస్ట్, 11018, 19 కరైకల్-ముంబై, 06223, 24 చెన్నై-శిమోగ రైళ్లు రాజంపేట మీదుగా వెళుతున్న ఆగడం లేదు. ఒకవైపు అమృత్ భారత్ పథకం కింద కోట్ల రూపాయలు రాజంపేట రైల్వే స్టేషన్ అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నారు. మరోవైపు రోజుకో ట్రైన్ స్టాపింగ్ ఎత్తివేస్తున్నారు. రైల్లే ఆగనప్పుడు అభివృద్ధికి నిధులు ఎందుకని దీని ద్వారా ఏమి సంకేతాలు ఇస్తున్నారని సర్వత్రా ప్రశ్న ఉత్పన్నం అవుతుంది. ఇకనైనా రాజంపేట ఎంపీ మిధున్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాధ రెడ్డితో పాటు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపి నేతలు స్పందించి జయంతి ఎక్స్‌ప్రెస్‌తో పాటు ఆగకుండా వెళుతున్న రైళ్లను నిలిపేలా కృషి చేస్తారో లేదో వేచి చూడాల్సిందే.

# ఇన్చార్జి మంత్రిని కలిసిన జగన్ రాజు

**అన్నమయ్య ప్రాజెక్టు పూర్తికి వినతి**



**రాజంపేట అర్బన్, నవంబర్ 03, ప్రభాతవార్త:**
రాజంపేట ప్రాంత రైతాంగానికి వరప్రసాదిని అయిన అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణం పనులను వెంటనే చేపట్టి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్చార్జి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్ రాజు కోరారు. ఆదివారం రాయచోటికి వచ్చిన జిల్లా ఇన్చార్జి మంత్రిని జగన్‌మోహన్ రాజు కలిశారు. ఈ సంధఋంగా ఆయనకు నియోజకవర్గంలో పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ప్రధానంగా అన్నమయ్య పునర్నిర్మాణ పనులు గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు పెద్దఎత్తున ఆశలు పెట్టుకున్నారని తెలిపారు. ప్రధానంగా ఈ సీజన్‌లో ప్రాజెక్టు పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటే వచ్చే సీజన్ రైతులకు పనికొస్తుందని తెలియజేశారు. ఈ విశయంలో నీటి పారుదల శాఖ అధికారులతో చర్చించి పనులు చేపట్టేలా చూడాలని కోరారు.

### మంత్రిని కలిసిన తెలుగు తమ్ముళ్లు

నియోజకవర్గ అభివృద్ధి విశయంలో వెనుకబడి ఉందని పార్టీ నేతలు ఇన్చార్జి మంత్రి జనార్ధన్ రెడ్డిని కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. కడప-రేణిగుంట జాతీయ రహదారి పనులు ఇంకా ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని కోరారు. ఉద్యాన పంటలు సాగు ఎక్కువని ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటుచేయాలని కోరారు. అంతేకాకుండా రోడ్లు అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించిన వారిలో టిడిపి నేతలు టి.లక్ష్మి నారాయణ, గీతాంజలి, వెంకటరమణ, మండల గ్రామీణ అధ్యక్షుడు గన్నే సుబ్బనర్సయ్య నాయుడు, రాజంపేట పట్టణ అధ్యక్షుడు దగ్గుపాటి మని, తెలుగుయువత జిల్లా నేత ఇడిమడకల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### టిడ్కో ఇళ్లను లబ్దిదారులకు అందించాలని

# 18న అర్జీల కార్యక్రమం

**సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర**

**ప్రొద్దుటూరు, నవంబర్ 03, ప్రభాతవార్త:**
ఈనెల 18న టిడ్కో ఇళ్లను లబ్దిదారులకు అందించాలని అన్ని సచివాలయాల్లో నిర్వహిస్తున్న అర్జీల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు. రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా పెండింగ్‌లో ఉన్న టిడ్కో ఇండ్లను లబ్దిదారులకు అందజేయాలని వినతిపత్రాలు అందించిన అనంతరం ఉద్యమ కార్యాచరణ చేపట్టి అమలు చేయాలని ఏరియా సమితికి తెలియజేశారు. అలాగే జగనన్నా కాలనీల్లో మౌళిక వసతుల కల్పనకై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. డిసెంబర్ 26నాటికి పార్టీ సభ్వత్యాల పునరుద్ధరణ చేపట్టి శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. జిల్లా సమస్యలపై భవిష్యత్తు ఉద్యమాలకై సిద్ధం చేయనున్నట్లు జిల్లా శిక్షణ తరగతులు బద్వేల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రొద్దుటూరు ప్రాంతంకు నీటి ప్రాజెక్టుల ఉద్యమంకై వావిలాల గోపాలకృష్ణయ్య, వైవి రావు లాంటి వారిని ఆహ్వానించిన ప్రాంతమని అలాంటి ప్రొద్దుటూరు నుంచే కృష్ణా జిల్లాలను రాయలసీమకు తరలింపుకై భవిష్యత్తు సదస్సు నిర్వహించాలన్నారు. అలాగే కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకై నూతన కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఉద్యమ పోరాటానికి డిసెంబర్‌లో జిల్లా సదస్సు ఇక్కడ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రామయ్య, ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు, సమితి సభ్యులు శివారెడ్డి, రామకృష్ణ, మచ్చా శ్రీనివాసులు, హుస్సేన్, భాస్కర్, ప్రమీళ, సుజాత తదితరులు పాల్గొన్నారు.



## కడప కలెక్టర్‌గా చెరుకూరి శ్రీధర్



**రాజంపేట అర్బన్, నవంబర్ 03, ప్రభాతవార్త:**
కడప జిల్లా నూతన కలెక్టర్‌గా రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. పరిశ్రమ శాఖ రాష్ట్ర డైరెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీధర్‌ను కడప కలెక్టర్‌గా నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా ముగ్గురు ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా కడప కలెక్టర్ నియామకం జరిగింది. ఇక్కడ పని చేస్తున్న శివశంకర్‌ను తెలంగాణకు బదిలీ చేసిన విశయం తెలిసిందే. ప్రస్తుతం ఇంచార్జ్ కలెక్టర్‌గా అధితి సింగ్ వ్యవహరిస్తున్నారు. నేడో, రేపో నూతన కలెక్టర్ శ్రీధర్ బాధ్యతలు స్వీకరిస్తారని సమాచారం.

## మద్దిరేవుల బిల్డింగ్ హరిజనవాడలో మెడికల్ క్యాంపు

**- మేలుకొన్న వైద్య సిబ్బంది**

వార్తకు స్పందన

**లక్కిరెడ్డిపల్లె,నవంబర్ 03, ప్రభాతవార్త:**
మండలంలోని మద్దిరేవుల బిల్డింగ్ హరిజనవాడ నందు ఆదివారం దేవళంపల్లె వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. మంచం పట్టిన పల్లెలు అనే శీర్షిక వార్తలో కథనం రావడంతో ఆదివారం కస్తూరిబా గాంధీ పాఠశాలతో పాటు బిల్డింగ్ ఎస్సీ కాలనీలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రభలుతున్నందున ఇటీవల కురిసిన వర్షాలకు జ్వరాలు ప్రభలడంతో గ్రామంలోని రోగులకు మందులు పంపిణీ చేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా దేవళంపల్లె పిహెచ్‌సి సిఇఓ దీప్తి మాట్లాడుతూ ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఏ రోజు నీరు ఆ రోజే ఉపయోగించాలని ప్రజలకు తెలియజేశారు. వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామస్థులకు బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఎప్పటికప్పుడు గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపడుతున్నట్లు, అవసరమై చోట బ్లీచింగ్ చల్లిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రజనీష్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవళంపల్లె వైద్య సిబ్బంది, సచివాలయం, ఎఎన్ఎం విజయకుమారి, ఆశా కార్యకర్త కళావతి, పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



## భక్తులతో కిటకిటలాడిన గంగమ్మ ఆలయం

**లక్కిరెడ్డిపల్లె,నవంబర్ 03, ప్రభాతవార్త:**
మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మతల్లి ఆలయానికి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. గంగమ్మ దేవతకు వేలాది మంది భక్తులు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతున్న శ్రీశ్రీ అనంతపురం గంగమ్మ దేవత ఆలయానికి భక్తులు తరలిరావడంతో క్యూ లైన్‌లలో అమ్మవారి దర్శనం కొరకు భక్తులు వేచి ఉన్నారు. భక్తులకు తాగునీటి ఇబ్బందులు తప్పలేదు. ఆలయ ప్రాంగణం భక్తులతో రద్దీగా మారి చిన్నపాటి జాతరను తలపించింది. ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. చుట్టుపక్క ప్రాంతాల నుంచే కాక ఇతర ప్రాంతాల అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకోవడానికి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ పూజారులు చుల్లు వంశీయులు శ్రీనివాస్ యాదవ్, గంగాధర్ యాదవ్ భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ముక్తి స్థలి-ముక్తి రామేశ్వరం ఆలయ చరిత్ర

## నేటి నుండి శ్రీ రాజరాజేశ్వరి దేవి సమేత శ్రీ ముక్తి రామలింగేశ్వర స్వామి కార్తీక మహోత్సవములు





**ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 03, ప్రభాతవార్త:**

కడప జిల్లాలోని ప్రొద్దుటూరు పట్టణములో పావన పినాకిని తీరాన గల ప్రసిద్ధ క్షేత్రమే ముక్తి రామేశ్వరం. ఈ క్షేత్రంలో శ్రీరాముల వారు ప్రతిష్టించిన శివలింగం ఉండటం వలన ఈ ప్రాంతానికి రామేశ్వరం అని, మార్జాల రూపాన గల రావణుని శ్రీరాములు తన బాణాల చేత వధించి ముక్తి లభించడం వల్ల ఈ ప్రాంతానిక ముక్తి రామేశ్వరమని పేరు వచ్చిందని చెబుతారు. రావణ వధ అనంతరం తనకు అపాదితమైన బ్రహ్మ హత్య దోస నివారణకు శ్రీరాముడు ఈ ప్రాంతంలో శివలింగం ప్రతిష్ట చేయ సంకల్పించాడు. శ్రీరాముని ఆజ్ఞపై ఆంజనేయుడు కాశీ నుండి శివలింగం తీసుకొని రావడానికి వెళ్లాడు. ముహూర్త సమయములకు ఆంజనేయుడు రాకపోవడం వల్ల శ్రీరామచంద్రుల వారు "సైకత లింగం"(ఇసుకతో తయారు చేయబడిన శివలింగం) ప్రతిష్ఠించాడు. తర్వాత ఆంజనేయుల వారు వచ్చి తాను తెచ్చిన శివలింగాన్ని సైకత లింగానికి కొద్ది దూరం అభిముఖంగ ప్రతిష్ఠించారు. అవే ఈనాడు శ్రీ ముక్తి రామలింగేశ్వర క్షేత్రం గాను శ్రీ హనుమత్ లింగేశ్వర క్షేత్రం గాను ప్రసిద్ధికెక్కినవి. ఈ ఆలయం ఎత్తైన ప్రాకార గోడలతో రెండు ద్వారాలు కలిగి ఉన్నవి. ఐదు అంతస్థుల గల ఈ గాలి గోపురం నెమలి వాహణంపై కుమార స్వామి, దుర్గా దేవి, నృత్య గణపతి, గరుడ వామణంపై విష్ణుమూర్తి, లక్ష్మి, ఖాళీగా మర్దనుడిగా శ్రీ కృష్ణుడు, కూర్చొని ఉన్న భంగిమలలో శివపార్వతులు, గోపిక వస్త్రావహరునిగా శ్రీ కృష్ణుడు శృంగాల శిల్పాలతో ఎంతో రమణీయంగా ఉన్నది. గోపురం నలువైపులా కూర్చొని ఉన్న నందీశ్వరుల శిల్పాలతో శోభాయ మానముగా ఉన్నది. ఈ గోపురం శ్రీ కృష్ణదేవరాయులు కట్టించినట్లు గుడిలోని శాసనాల ద్వారా తిరుగుతున్నది. శ్రీ రామచంద్రుల వారు ప్రొద్దుపొడవక మునుపే ఈ సైకత లింగమును ప్రతిష్టించినందువలన ఈ పట్టణమునకు ప్రొద్దుటూరు అనే నామదేము కలిగినదని చెప్పుకొందురు. శ్రీ రామచంద్రుల వారు ప్రతిష్ఠించిన ఈ సైకత లింగంపై శ్రీ రామచంద్రుల వారి వ్రేళ్ల గుర్తులు ఇప్పటికి మనం దర్శించవచ్చును. ఈ ఆలయం ముఖమండపంలో నందీశ్వరుని విగ్రహం కలదు. గర్భగుడిపై గల విమానం వేసరి పద్ధతిలో మూడు అంతస్థుల శిఖరంపై కలశం కలిగి ఉన్నది. శ్రీ ముక్తి రామలింగేశ్వర స్వామి ఆలయం ప్రక్కనున్న శ్రీ రాజరాజేశ్వరి దేవి ఆలయం కలదు. ఈ ఆలయం నందు శ్రీ రాజరాజేశ్వరి దేవి మరియు శ్రీ ఆదిశంకరాచార్యుల చేత ప్రతిష్టించబడిన "శ్రీ చక్ర యంత్రం" కలదు. ఈ శ్రీ చక్ర యంత్రము ద్వారా ప్రశస్తమైనదనియు ఆ యంత్రమునకు మనోవాంఛాయ ఫల సిద్దిరస్థు అని ప్రతీతి. ఆ యంత్ర మహిళ వల్ల ప్రొద్దుటూరు పట్టణము అన్ని రంగముల యందు సర్వతోముఖాభివృద్ధి పొంది ఉన్నదని ప్రతీతి. ఇచ్చట భక్తులు అమ్మవారి శ్రీ చక్రం ఎదుట నిలబడి మనసులో కోరికలు కోరుకున్న వారికి తప్పనిసరిగా ఫలించగలవని ఆనవాయితి. శ్రీ చక్ర యంత్రమునకు వెనుక భాగమున"చండీమాత" కలదు. ఇక్కడ అమ్మవారిని దర్శించిన ఎడల శరీరంలో గాలి ఇతర పీడలు పోవునని ప్రతీతి. శ్రీ రాజరాజేశ్వరి దేవి ఆలయం ప్రక్కన నవగ్రహ మండపం కలదు. మండపము ఎదురుగా రెండు వైపులా మెట్లు అమర్చబడిన కోనేరు ఉన్నది. ఈ కోనేటి గోడలపై ఒకే శిరస్సు గల రెండు హంసలు, వెన్న చిలుకుతున్న యువతులు ఒక శృంగార భంగిమ చిత్రములు చెక్కబడ్డాయి. దేవాలయంలోపలి వైపున ప్రాకారం మొత్తం స్ధంబాలతో అలంకరించబడిన మండపములు ముఖ ద్వారానికి ఎదురుగా ధ్వజస్ధంబం బలిపీఠం దానికి అభిముఖంగా ఒక కళ్యాణ మండపం, వేదికపై దేవతామూర్తుల దేవాలయానికి ఎడమవైపున ఎత్తేన వేదికపై దేవతామూర్తుల ఉత్సవ విగ్రహములు కొలువుదీరి ప్రజలు దర్శించుకొనటకు పెద్ద వేదిక యున్నది. మరియు ఆలయ ఆవరణములో వీరభద్ర స్వామి, సుబ్రమణ్యేశ్వర స్వామి, విగ్నేశ్వర స్వామి, శ్రీ సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వామి, దక్షిణామూర్తి, శ్రీ లక్ష్మినరసింహస్వామి ఉప ఆలయాలు కలవు. ఆలయ ప్రాంగణంలో నాగదేవతా ప్రతిమలు మరియు హోమ మండపలు కలదు.

# ప్రభుత్వ ఉద్యోగులకు 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలి



**ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 03, ప్రభాతవార్త:**

ప్రభుత్వ ఉద్యోగుల కోసం 30% మధ్యంతర భృతి తక్షణం ప్రకటించాలని, 2023 జూలై 1 నుండి అమలు చేయాలని ఏపీసిపిపి రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీయపురెడ్డి వెంకట జనార్ధన్ రెడ్డి కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతన జీవుల వేతనాలు పెరగకపోవడం శోచనీయం అని, ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగా పీఆర్సీని వెంటనే అమలు చేయాలన్నారు. శ్రీరాముల పేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పిఆర్సీలో కూడ ఉద్యోగులు చాలా నష్టపోయారని ఇప్పుడు కూడ పీఆర్సీ ప్రకటన లుకపోవడం వలన ఉద్యోగులు ఒక సంవత్సరం వేతన పెంపును కోల్పోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వారధి మధు మాట్లాడుతూ గత పిఆర్సీలో కూడ ఉద్యోగులు చ ఆలా నష్టపోయారని ఇప్పుడు కూడ పీఆర్సీ ప్రకటన లేకపోవడం వలన ఉద్యోగులు ఒక సంవత్సరం వేతన పెంపును కోల్పోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వారధి మధు మాట్లాడుతూ ఒకటో తేదిన జీతం కూడ ఉద్యోగులకు గగనం అయిందని, ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రతి ఉద్యోగికి ఒకటో తేదిన జీతం జమ చేస్తామని చెప్పి ఇలా చేయడం తగదన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు రిజ్వాన్ అలి మాట్లాడుతూ ప్రభుత్వం మధ్యంతర భృతి చెల్లించి, పీఆర్సీ నివేదిక సత్వరమే తెప్పించుకొని వేతన సవరణ జరపాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ సీపిఎస్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న కరువు బద్యం బకాయిలు చెల్లించాలని, 2003 డీఎస్సీ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న కరువు బత్యం బకాయిలు చెల్లించాలని, 2003 డీఎస్సీ ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నాగ చంద్రుడు, పట్టణ కార్యదర్శి మధుసూధన్, పెద్దముడియం అధ్యక్షులు చంద్రశేఖర్, మురళీమోహన్, జమాల్ రెడ్డి, పరమేశ్వర తదితరులు పాల్గొన్నారు.

# 'డబుల్ చిన్'కు చెక్ పెట్టేద్దాం !



**అందం విషయంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. కొన్ని చిన్న చిన్న సమస్యలు ముఖాకృతిని దెబ్బతీస్తుంటాయి. డబుల్ చిన్ కూడా అలాంటిదే! గడ్డం దగ్గర కొవ్వులు పేరుకుపోవడం వల్ల అదనపు లేయర్‌లా కనిపిస్తుంటుంది.** ఈ సమస్యతో నలుగురిలోకి వెళ్లడానికి ఇబ్బంది పడుతుంటారు కొందరమ్మాయిలు. అయితే కొన్ని ఇంటి చిట్కాలు పాటిస్తూ డబుల్ చిన్‌ను సులభంగా తగ్గించుకోవచ్చంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి.

**ఎందుకిలా?...** డబుల్‌చిన్ రావడానికి ముఖ్యంగా 3 కారణాలున్నాయని చెబుతున్నారు నిపుణులు.

- అధిక బరువు-ఆకస్మాత్తుగా బరువు పెరగడం లేదా తగ్గడం వల్ల ఈ సమస్య వస్తుంది. బరువు పెరిగినప్పుడు గడ్డం దగ్గర కొవ్వులు పేరుకుపోవడం, తగ్గినప్పుడు అక్కడి చర్మం వదులుగా మారడమే ఇందుకు కారణం.
- వంశపారంపర్యంగా డబుల్ చిన్ రావడానికి జన్యుపరమైన కారణాలూ ఉన్నాయంటున్నారు నిపుణులు.
- వయసు పైబడడం-వయసు పెరుగుతున్న కొద్దీ ముఖ కండరాలు దృఢత్వాన్ని కోల్పోవడం, తద్వారా గడ్డం కింద కొవ్వు పేరుకుపోవడం, అక్కడి చర్మం వదులువడం వల్ల కూడా డబుల్ చిన్ వస్తుందట!

**ఇంటి చిట్కాలతో ఉపశమనం!..** బాగా నమలండి..!: డబుల్ చిన్ సమస్యతో బాధపడే వారు ఆహారాన్ని బాగా నమిలి మింగాలి. ఇలా చేయడం వల్ల ముఖ కండరాలకు వ్యాయామం అంది పటిష్టంగా తయారవుతాయి. దీనివల్ల అదనపు కొవ్వులు పేరుకుపోకుండా చక్కటి ముఖాకృతిని సొంతం చేసుకోవచ్చు. అలాగే మార్కెట్లో లభించే షుగర్ ఫ్రీ చూయింగ్ గమ్స్ నమలడం కూడా మంచిదే తద్వారా దవడల దగ్గర పేరుకున్న కొవ్వు సులభంగా కరుగుతుంది.

**తెల్లసొనతో..** రెండు గుడ్లలోని తెల్లసొన, ఒక టేబుల్‌స్పూన్ పాలు, కొద్దిగా తేనె-నిమ్మరసం.. ఇవన్నీ బాగా కలిపి ఈ మిశ్రాన్ని డబుల్ చిన్ ఉన్న చోట ప్యాక్‌లా అప్లై చేసుకోవాలి. అలా 30 నిమిషాలు ఆరనిచ్చి తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి. తెల్లసొన చర్మాన్ని బిగుతుగా మారుస్తుంది. ఇలా తరచూ చేయడం వల్ల డబుల్ చిన్ క్రమంగా తగ్గుముఖం పడుతుంది. గుడ్డు వాసన నచ్చని వారు ఈ మిశ్రమంలో కొన్ని చుక్కల ఏదైనా ఎసెన్షియల్ ఆయిల్ కూడా కలుపుకోవచ్చు.

**గ్రీన్ టీ.....** గ్రీన్ టీ శరీరంలోని జీవక్రియలను వేగవంతం చేస్తుంది. చెడు కొవ్వును కరిగిస్తుంది. కాబట్టి కాఫీ, టీలకు బదులుగా గ్రీన్ టీని డైట్‌లో చేర్చుకుంటే డబుల్ చిన్‌ను క్రమంగా తగ్గించుకోవచ్చు.

**విటమిన్ 'ఇ'....** మనం రోజూ తీసుకునే ఆహారంలో విటమిన్ 'ఇ' ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. బ్రౌన్ రైస్, ఆకుకూరలు, పాల ఉత్పత్తులు, స్వీట్ కార్న్, యాపిల్, సోయా బీన్స్, పప్పు దినుసులు.. ఇలాంటి వాటిల్లో విటమిన్ 'ఇ' ఎక్కువగా లభిస్తుంది. కాబట్టి వీటిని తప్పకుండా ఆహారంలో చేర్చుకోవాలి.

**నీళ్లు ఎక్కువగా ...** రోజుకు కనీసం 8 నుంచి 10 గ్లాసుల నీళ్ల తాగడం వల్ల శరీరంలో ఉండే కొవ్వుతో పాటు దావడ, గడ్డం కింద పేరుకున్న అనవసర కొవ్వులు కూడా కరిగిపోతాయి. అలాగే నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్ల కూడా ఆహారంలో చేర్చుకోవాలి.

**ఈ వ్యాయామాలతో...** 1. ఎక్కువగా నవ్వడం, మాట్లాడటం వల్ల కూడా ముఖ కండరాలకు చక్కని వ్యాయామం అందుతుంది. తద్వారా డబుల్ చిన్‌నూ తగ్గించరకోవచ్చు. 2. మెడ గుండ్రంగా, నెమ్మదిగా కొద్ది సమయం పాటు తిప్పడం, పైకి-కిందకు కదిలించడం.. వంటి చిన్న చిన్న వ్యాయామాలు చేసినా ఫలితం ఉంటుంది. 3. అలాగే క్యాలరీలు, కొవ్వులు లేని ఆహార పదార్థాల్ని రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి.



# పిసిఓఎస్ తగ్గాలంటే..







పొట్ట కండరాలు బలపడటానికీ, వెన్నెముక, పిసిఓఎస్ సమస్యలు తగ్గటానికీ, సిస్టులు, ఫైబ్రాయిడ్స్ కరగడానికీ ఉష్ట్రాసనం బాగా పనిచేస్తుంది. ఈ ఆసనం వేయడానికి ముందుగా రెండు కాళ్లను వెనకకు మడిచి కూర్చోవాలి. తరవాత నెమ్మదిగా మోకాళ్ల మీద లేచి కుడిచేత్తో కుడికాలి మడమని, ఎడమేత్తో ఎడమ కాలిమడమని వెనక్కి వాలుతూ ఫొటోలో చూపిన విధంగా పట్టుకోవచ్చు. మొదటిసారి ప్రయత్నించేవారు పాదాన్ని అందుకోలేక పోతే పాదాన్ని వేళ్లమీద ఆనించి మడమని పట్టుకోవాలి. ఈ ఆసనాన్ని పదిసెకన్ల చొప్పున రోజుకి మూడుసార్లు చేయాలి. నెమ్మదిగా శ్వాస తీసుకుంటే యథాస్థితికి వచ్చి మోకాళ్లపై కూర్చోవాలి. ఈ ఆసనం చేశాక దీని అనుబంధ ఆసనం కూడా చేస్తే మరింత ఫలితం చేకూరుతుంది.

**శశాంకాసనం ...** ఉష్ట్రాసనం వేసిన తరవాత ఈ శకాంకాసనం చేస్తే శరీరానికి విశ్రాంతి లభిస్తుంది. అందుకే దీన్ని శాంతినిచ్చే ఆసనం అని కూడా అంటారు. ఈ ఆసనం వేయడం వల్ల ఛాతీ, పొట్ట, వెన్నెమక కండరాలకి నూతన శక్తి లభించి హాయిగా ఉంటుంది. మంచి నిద్రపడుతుంది. కోపం అదుపులో ఉంటుంది. ఈ ఆసనం వేయడానికి ముందుగా వజ్రాసనంలో కూర్చోవాలి. నెమ్మదిగా రెండు చేతులనూ పైకి పెట్టి శ్వాస వదులుతూ మెల్లగా వంగి, చేతులను ముందుకు ఫొటోలో చూపిన విధంగా ఉంచాలి. ఈ క్రమంలో నుదుటిభాగం నేలను తాకేలా ఆనించాలి. మొదటిసారి ప్రయత్నించేవారు దిండుసాయంతో చేస్తే ఎటువంటి ఇబ్బంద ఉండదు.

# పిల్లలకు బోర్డ్‌గేమ్‌లో పౌరాణిక కథలు!




**రామాయణ, మహాభారతాలు పౌరాణిక గాథలే కావచ్చు. కానీ, వాటినుంచి నేర్చుకోవాల్సిన జీవన నైపుణ్యాలు ఎన్నో ఉన్నాయి. అందుకే, వాటిని పసిప్రాయంలోనే పిల్లలకు పరిచయం చేయాలనుకున్నారు పిల్లల వైద్య నిపుణురాలు, చైల్డ్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్.. డాక్టర్ అమూల్య మైసూరు. కానీ, కథలుగా చెబుతామంటే ఈ కాలం పిల్లల వినరు కదా! అందుకే వాటిని బోర్డ్‌గేమ్‌ల రూపంలో తీసుకొచ్చారీమె. ఆ ప్రయాణాన్ని తెలుసుకుందాం..**

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. దాంతో పిల్లలకు అనేక విషయాలు నేర్చుకునే వీలుండేది. కానీ, ఇప్పటి పిల్లలకు ఆ అవకాశం తక్కువ. దీంతో డిజిటల్ స్క్రీన్లకు అలవాటు పడిపోయి అనేక జీవన నైపుణ్యాలు నేర్చుకోవడంలో వెనకబడుతుతన్నారు. అందుకే మన సంప్రదాయం, సంస్కృతుల్లోని విలువలను ఆటల ద్వారా వారికి నేర్పించాలనుకున్నా. నేను పుట్టి, పెరిగింది హైదరాబాద్‌లోనే. ఇంట్లో వాళ్లంతా వైద్యులే కావడంతో నేనూ వైద్యవృత్తినే ఎంచుకున్నా. 15 ఏళ్లుగా చైల్డ్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్‌గా పనిచేస్తున్నా. మాంటిస్సోరి టీచర్ శిక్షణ కూడా పొందా. నా భర్త ఇంజినీర్. మాకు ఇద్దరు పిల్లలు. కొవిడ్ సమయంలో, ఆ తరవాత కూడా పిల్లలు బాగా మొబైళ్లకు అలవాటు పడ్డారు. దాన్ని తగ్గించేందుకు ఏదైనా చేయాలనుకున్నా. అప్పుడు వచ్చిన ఆలోచనే' అవిన్యా గేమ్స్. అందులో భాగంగా ఏడాదిక్రితం 'రైడ్ విత్ రామా' పేరుతో బోర్డుగేమ్‌ని తీసుకొచ్చి. ఈ ఆట స్నేక్ అండ్ ల్యాడర్‌లానే ఉంటుంది. వాల్మీకి రామాయణం ఆధారంగా.. రాముడు గురువు దగ్గర ఉన్నప్పటి నుంచీ లంక నుంచి సీతను తిరిగి తెచ్చుకునే వరకూ జరిగిన ప్రధాన ఘట్టాలన్నీ ఇలస్ట్రేషన్ రూపంలో పొందుపరిచా. పాచిక వేశాక, అక్కడ ఉన్న సంఘటనను బట్టి ముందుకు వెళ్లాలా? వెనక్కు రావాలా? అనే సూచనలు ఉంటాయి. ఆ కథను తెలిపే కార్డ్‌లూ ఉంటాయి. దాన్నిబట్టి మనం ఏం నేర్చుకోవచ్చో కూడా వాటిలో రాసి ఉంటుంది.

**అవార్డులు వచ్చాయి....**

ఇటీవలే 'ప్లే విత్ కృష్ణ' బోర్డు గేమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చా. ఇదో సాహస క్రీడ. కన్నయ్య బాల్యంలో చేసిన సాహసాలకు సంబంధించిన బొమ్మలు ఇందులో పొందుపరిచి ఉంటాయి. ఈ బోర్డులో రెండు మోడ్‌లు ఉంటాయి. ఎక్కువ కాయిన్లు సేకరించి గెలుపొందడం ఒకటి. కాయిన్లతో సంబంధం లేకుండా గమ్యాన్ని చేరుకోవడం మరొకటి. ఏ సంఘటన మీద పడితే ఎన్ని కాయిన్లు సేకరించాలి? వేరే వాళ్లకు ఎన్ని ఇవ్వాలి? అనే సూచనలు అందులో ఉంటాయి. మధ్యలో యాంగర్, కామ్‌డౌన్, ట్రూ, గ్రాటిట్యూడ్.. లాంటి జోన్లనూ ఏర్పాటుచేశాం. ఈ పేర్లకు తగినట్లే యాక్టివిటీస్ ఉంటాయి. ఉదాహరణకు కామ్‌డౌన్ జోన్‌లో అడుగుపెట్టినప్పుడు, పాచిక వేస్తాం. 1 పడితే.. ఐదుసార్లు దీర్ఘశ్వాస తీసుకోవాలి, 2 పడితే.. అంకెలను వెనక క్రమంలో చదవాలి, 3 పడితే.. ధ్యానం చేయాలి. . ఇలా మిగతా జోన్లకీ సంబంధిత యాక్టివిటీలు ఉంటాయి. ఈ ఆటల వల్ల పిల్లల్లో కమ్యూనికేషన్, బృందంతో కలిసి పనిచేయడం, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెరుగుతాయి. నియమ నిబంధనలు పాటించడం, గెలుపోటముల్లో స్థితప్రజ్ఞతతో ఉండడం నేర్చుకుంటారు. పాచిక వేసే అవకాశం వచ్చే దాకా వేచి ఉండే సమానం, ఓర్పు.. లాంటి కృష్ణునిలోని సుగుణాలన్నీ పిల్లలకు అలవడతాయి. హైపరాక్టివ్, ఏడిహెచ్‌డి.. లాంటి సమస్యలు ఉన్న పిల్లల్లో ఈ నైపుణ్యాలను నేర్పించడం అవసరం. దానివల్ల వారిలో కుదురుగా కూర్చోవడం, ఏకాగ్రత వంటివి పెరుగుతాయి.



ప్రస్తుతంఒ స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ, ఇస్కాన్ దేవాలయంలో స్టోర్లను ఏర్పాటుచేశాం. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ ఫాట్‌ఫామ్‌ల్లోనూ అందుబాటులో ఉంచాం. యూఎస్‌ఏ, సింగపూర్, యూకెల్లోనూ అమ్ముతున్నాం. భవిష్యత్తులో హనుమంతుడు, గణేశుని మీదా బోర్డుగేములు తీసుకురావాలనుకుంటున్నా. పుస్తకాలు, పజిల్స్ రూపంలోనూ తేవాలనే ప్రణాళిక ఉంది. ఇక, కొవిడ్ సమయంలో.. కచ్చితమైన సమాచారం అందరికీ అందాలనే ఉద్దేశంతో 'పేరెంటింగ్ విత్ డాక్టర్ అమూల్య' పేరుతో ఇన్‌ఫ్లూయెన్సర్‌గానూ మారా. అందుకుగానూ గతేడాది ఇన్‌స్పైర్ బియాండ్ మదర్‌హుడ్ అనే కమ్యూనిటీ నుంచి బెస్ట్ ఎడ్యుకేషనలిస్ట్ అవార్డు అందుకున్నా.

# వయసుతో పాటు అందమూ పెరుగుతుంది

సాధారణంగా ఎదుటివారి మొహం చూసి వాళ్ల వయసును అంచనా వేయచ్చు. అయితే అన్ని సందర్భాల్లోనూ ఇది సాధ్యం కాకపోవచ్చు. కొంత మంది వయసు పెరిగినా సరే.. నవ యవ్వనంగా కనిపిస్తుం టారు. తీరా వాళ్ల అసలు వయసేంటో తెలుసుకొని ఆశ్చర్యపోవడం మన వంతవుతుంది. చైనా బ్యూటీస్ ఇదే కోవకు చెందుతారు. వయసుతో పాటు అందమూ పెంచుకుంటూ పోతున్నా ఈ ముద్దుగుమ్మల సౌందర్య వెనుక.. ప్రాచీన కాలం నాటి సౌందర్య పద్ధతులున్నాయట! మరి, అవేంటో మనమూ తెలుసుకుందాం రండి.,.

**ముత్యపు పొడితో మెరుపు ...** ముత్యాల్ని మనం జ్యుయలరీలో భాగంగానే చూస్తాం.. కానీ చైనా మహిళలు వీటిని సౌందర్య పోషణలో భాగం చేసుకుంటారట! చర్మాన్ని మెరిపించే గుణాలు వీటిలో ఉండడమే ఇందుకు కారణం. ముత్యాల్ని మెత్తగా పొడి చేసుకుని.. ఆ పొడిని ఫేస్‌ప్యాక్స్‌లో ఉపయో గించడం, ఫేషియర్స్‌లో భాగం చేసుకోవడం.. వంటివి చేస్తుంటారట! ఇక ఈ పొడితో ఉండే అమైనో ఆమ్లాలు, ఖనిజాలు కొలాజెన్ ఉత్పత్తిని ప్రేరేపించి.. చర్మ కాంతిని పెంచడంలో సహకరిస్తాయి. అంతేకాదు.. చర్మానికి సాగే గుణాన్ని అందించి.. ముడతలు, గీతలు పెంచడంలో సహకరిస్తాయి. అంతేకాదు.. చర్మానికి సాగే గుణాన్ని అందించి.. ముడతలు, గీతలు ఏర్పడకుండా చేసే గుణాలూ ఈ పొడిలో పుష్కలంగా లభిస్తాయంటున్నారు నిపుణులు. అయితే మన దగ్గర కూడా కొంతమంది ముత్యపు పొడిని ఫేషియల్స్‌లో భాగంగా వాడడం చూస్తుంటాం. కానీ చైనా యువతుల మాదిరిగా ఇతర బ్యూటీ ట్రీట్‌మెంట్లలోనూ దీన్ని వాడడం వల్ల సమన్వంగా మెరిసిపోవచ్చని సౌందర్య నిపుణులు సలహా ఇస్తున్నారు.

**అందానికి రైస్ వాటర్...** బియ్యం కడిగిన నీటిని మనలో చాలామంది బయటపడేస్తుంటారు. కొంతమంది మాత్రం తమ సౌందర్య పోషణలో భాగం చేసుకుంటుంటారు. కానీ చైనా మహిళలు మాత్రం వీటిని సౌందర్య పోషణలో భాగంగా వాడుతుంటారట! యుక్త వయసు నుంచే వారికి ఇదో అలవాటుగా మారిపోతుందని అక్కడి సౌందర్య నిపుణులు చెబుతున్నారు. వీటితో రోజూ ముఖాన్ని శుభ్రం చేసుకోవడం, టోనర్‌గా ఉపయోగించడం.. వంటివి చేస్తుంటారట! ఈ నీళ్ల చర్మంలో పిహెచ్ స్థాయుల్ని బ్యాలన్స్ చేసి.. చర్మ రంధ్రాల్ని బిగుతుగా మార్చుతాయి. అలాగే చర్మానికి మెరుపునూ అందిస్తాయి. తద్వారా నవయవ్వనంగా కనిపించవచ్చు.

**గుహ షా.. జేడ్ రోలర్ ! ..** ఈ రోజుల్లో చాలామంది తమ అందాన్ని ద్విగుణీకృతం చేసుకోవడానికి కొన్ని రకాల టూల్స్‌ని ఉపయోగిస్తున్నారు.

గుహషా, జేడ్ రోలర్.. అందులో కొన్ని! అయితే నిజానికి ఇవి చైనీయులు రూపొందించినవే! వాళ్లు ప్రాచీన కాలం నుంచే వీటిని తమ సౌందర్య పోషణలో భాగంగా ఉపయోగిస్తున్నారని అక్కడి నిపుణులు చెబుతున్నారు. జేడ్/క్వార్ట్జ్.. వంటి సహజసిద్ధమైన స్టోన్స్‌తో తయారయ్యే ఈ టూల్స్‌తో చర్మానికి మర్దన చేసుకోవడం వల్ల.. చర్మానికి రక్తప్రసరణ మెరుగుపడు తుంది. తద్వారా ముఖంపై మొటిమలు, మచ్చలు తొలగిపోవడమే కాదు.. ఉబ్బిన చర్మానికి సాంత్వన కూడా లభిస్తుంది. ఇక ఈ టూల్స్‌నీ ముఖంపై ఆయా భాగాల్లో మసాజ్ చేసుకునేలా విభిన్న ఆకృతుల్లో సౌకర్యవంతంగా రూపొందిస్తాయి.

# వాహనదారులు తప్పని సరిగా నిబంధనలు పాటించాలి : ఎస్ఐ

**అట్లూరు,నవంబర్ 03,ప్రభాత వార్త :**

వాహనదారులు తప్పని సరిగా నిబంధనలు పాటించాలని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన మండలంలోని క్రాస్ రోడ్డు ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్బంగా అన్ని వాహనాలను క్షున్నంగా పరిశీలించారు. మరియు వాహనదారులకు లైసెన్స్ లు పరిశాలించారు. ఈ సందర్బంగా రికార్డులు సరిగా లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తమ వాహనానికి తప్పని సరిగా అన్ని రికార్డులు కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా వాహనదారులు తప్పనిసిగా లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాన్ని నడపరాదని, అట్లు నడిపిన జరిమానా విధిస్తామన్నారు. అలాగే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా టూవీలర్ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమమంలో ఆయనతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## పాస్‌పోర్టు పోయినది

చంద్రమాకుల ప్రవీణ్, తండ్రి చంద్రమాకుల సత్య, ఇంటి నెం. 2-10A, చెర్వుముంద్రపల్లె, చింతపర్తి (పోస్ట్), వాల్మీకిపురం (మం) అన్నమయ్య జిల్లా ఏ.పి., చేర్వుముద్రపల్లె నుండి అనంతపురంకు బైకులో జిరాక్సుకు పోతుండగా నా పోస్‌పోర్టు నెం. T9378142 గల పాస్‌పోర్టు పోయినది. దొరికినచో ఈ క్రింది అడ్రస్‌కు గాని, ఫోన్ నెం. 9908693669కు తెలపగలరు.

## తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం జయప్రదం చేద్దాం



**సిద్దవటం, నవంబరు 3, ప్రభాతవార్త:**
రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం ఆదేశాల మేరకు సిద్దవటం మండలం టక్కోలి గ్రామ పంచాయతీ హరిజనవాడలో ఆదివారం తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం రాజంపేట పార్లమెంటు కార్యదర్శి అండ్లూరి నాగమునిరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా అనేక మంది కార్యకర్తలు మరియు ప్రజలు ఉత్సాహంగా యువకులు, మహిళలు, పెద్ద ఎత్తున సభ్యత్వాలు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంటు కార్యదర్శి నాగమునిరెడ్డి మాట్లాడుతూ తెదేపా జాతీయ అధ్యక్షుడు సీఎం నారా చంద్రబాబునాయుడు మరియు యువనేత మంత్రి నారా లోకేష్‌బాబు ఆలోచనలతో కార్యకర్తలకు అండగా నిలబడాలనే ఉద్దేశంతో సభ్యత్వ నమోదు చేసిన ప్రతి కార్యకర్తకు ఇన్సూరెన్స్ సౌకర్యం, ప్రమాద బీమా రూ.5లక్షలతో పాటు మరణించిన కుటుంబానికి మట్టి ఖర్చుల కింద రూ.10వేలు అందే విధంగా చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఇటువంటి కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యంగా చేరి తెదేపా కుటుంబంలో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిన్నపురెడ్డి, శ్రీను, శంకర్ తదితర కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## పంటలబీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోండి

**గాలివీడు, నవంబర్ 3(ప్రభాతవార్త):**



రబీ సీజన్లో పండించే ముఖ్య పంటలు వరి, వేరుశనగ, టమోటా మొదలగు పంటలకు ప్రభుత్వం అందిస్తున్న పంటలబీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోండని మండల వ్యవసాయాధికారి మురళీధర్ అన్నారు. ఆయన మాట్లాడుతూ రబీ సీజన్లో పండించే ప్రధాన పంటలైన వరి, వేరుశనగ, టమోటా మొదలగు పంటలకు తప్పనిసరిగా క్రాఫ్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, వేరుశనగ పంటకు ఎకరాకు రూ.96 ఇవి డిసెంబర్ 15వ తేదీలోపు చెల్లించాలని, అలాగే వరికి ఎకరాకు రూ.126లని ఇవి డిసెంబర్ 31వ తేదీలోపు చెల్లించాలని, టమోటా పంటకు ఎకరాకు రూ.1600 డిసెంబర్ 15లోగా చెల్లించాలని, ఈ మొత్తాన్ని మీసేవా కేంద్రాల్లో లేదా కామన్ సర్వీస్ సెంటర్లు(సీఎస్‌సీ)లలో చెల్లించి మీ పంటలను బీమా చేయించుకోవాలని తద్వారా ప్రకృతివైపరీత్యాల వలన వచ్చే నష్టాల్లో రైతు ఆర్థికంగా నష్టపోకుండా పంటలబీమా ద్వారా వచ్చే ఫలితాలను పొందాలని ఆయన మండలంలో గల రైతులను కోరారు. రబీ పంటలకు బ్యాంకులో పంట రుణాలు పొందిన రైతులు నేరుగా ప్రీమియం డబ్బులు మినహాయింపు చేసుకోవచ్చున్నారు. రబీ పంట రుణాలు తీసుకోని రైతులు మాత్రమే ప్రత్యేకంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరింత సమాచారం కోసం దగ్గర్లోని రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.

## అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిని కలిసిన సిద్దవటం టీడీపీ నేతలు



**సిద్దవటం, నవంబరు 3, ప్రభాతవార్త:**
అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని ఆదివారం సాయంత్రం రాయచోటి ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నందు సిద్దవటం మండల తెదేపా నేతలు మంత్రిని కలిసి శాలువాతో సత్కరించి పూల బొకే అందజేసి మండల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చలమయ్య యాదవ్, బాకరాపేట సర్పంచ్ ప్రతినిధి తుర్రా ప్రతాప్ నాయుడు, బీసీ నాయకులు గాలి సుబ్బయ్య యాదవ్, బాకరాపేట యూత్ శ్రీనివాసులు నాయుడు, బత్తల రాజా యాదవ్, పుత్తా బాబు, తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాట్వా నియోజకవర్గ అధ్యక్షులుగా పోతంశెట్టి సుధాకర్‌బాబు

**పీలేరు,నవంబరు 03 ప్రభాతవార్త:**



ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్సు వెల్ఫేర్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షులుగా పోతంశెట్టి సుధాకర్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ఉపాధ్యక్షులు శెట్టి సుబ్రమణ్యం తెలిపారు. ఆదివారం స్థానిక మెయిన్ ఉన్నత పాఠశాలలో పీలేరు నియోజకవర్గ కాట్వా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా రాష్ట్ర కోశాధికారి పోతం శెట్టి రమేష్, చిత్తూరుజిల్లా గౌరవాధ్యక్షులు పోకల తాతయ్యలు పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా పసుపులేటి శ్రీనివాసరావును ఆర్థిక కార్యదర్శి పసల సుధాకర్, గౌరవాధ్యక్షులు యర్రంశెట్టి రామకష్ణలను ఎన్నుకున్నట్లు తెలిపారు. కాపు విద్యార్థుల భవిష్యత్తును వారి విద్యను ప్రోత్సహించడానికి తగు ప్రోత్సాహకాలను అందజేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డెప్ప, యర్రంశెట్టి వెంకటరమణ, సద్దల కళావతి, పట్టణ బలిజ ప్రముఖులు పాల్గొన్నారు. రాష్ట్ర కోశాధికారిగా ఎన్నుక కాబడిన పోతంశెట్టి రమేష్‌ను ఈసందర్భంగా కాట్వా నాయకులు పీలేరు బలిజ ప్రముఖులు సన్మానించారు.

## 50 మందికి వైద్యపరీక్షలు

**పీలేరు, నవంబరు 03 ప్రభాతవార్త:**
నియోజకవర్గంలోని కేవి.పల్లె మండలంలోని తీతవగుంటపల్లె పంచాయతీ కుమ్మరపల్లెలోని శ్రీనివాసచారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వద్ధాశ్రమంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా చుట్టుపక్కల గ్రామాల వారు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సుమారు 50మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ట్రస్టు సభ్యులు బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఆదివారం జరిగే వైద్య శిబిరాన్ని చుట్టుపక్కల గ్రామాల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో వైద్యులు జిలాని, సిబ్బంది శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**సంబేపల్లె, నవంబరు 3, ప్రభాతవార్త:**



రాయచోటి-పీలేరు జాతీయ రహదారిలో సోమవరం గ్రామం గుట్టపల్లి సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో బద్వేలుకు చెందిన యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే బద్వేలు నియోజకవర్గం గోపవరం మండలానికి చెందిన చెన్నకేశవయ్య (29) సెలూన్ షాప్‌లో పనిచేస్తూ జీవనం సాగించేవాడు. శనివారం తన బంధువుల ఇంటికి వెళ్లి తిరుగు ప్రయాణంలో పీలేరు నుంచి రాయచోటికి వచ్చే మార్గమధ్యలో రాయచోటి నుంచి పీలేరు వెళ్తేన్న బొలెరో వాహనం ఢీకొని తలకు తీవ్రమైన గాయాలు అయ్యాయి. తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం సంబేపల్లె పోలీసు సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## చౌడయ్య అదృశ్యం

**చిన్నమండెం,నవంబర్ 03, ప్రభాతవార్త:**



చిన్నమండెం మండలం మల్లూరు గ్రామం కొడిదేపల్లెకు చెందిన మొడెం చౌడయ్య (44) కనిపించడం లేదని భార్య మొడెం కుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆదివారం తెల్లవారుజామున 5 గంటల నుండి కనిపించలేదని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

## పైపులైను ఏర్పాటుతో మంచినీటి సమస్య పరిష్కారం

**కలికిరి, నవంబరు 3, ప్రభాతవార్త:**



మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీ మర్రికుంటపల్లె రోడ్డులో స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ పంచాయతీ కార్యదర్శి నవాజుల్లాలు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో నూతన పైపులైను ఏర్పాటు చేయడం జరిగింది. పైపులైను లేక కొన్ని కుటుంబాలకు మంచినీటి సమస్య ఏర్పడడంతో స్థానికులు ఆ సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. వెంటనే స్పందించిన సర్పంచ్ సమస్యను ఎంపీడీవో భానుమూర్తిరావు దృష్టికి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించారు. దీంతో గ్రామస్థులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## మల్లయ్యకొండలో క్లీన్ అండ్ గ్రీన్

**- స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన ఎఫ్ఏ రమేష్**



**తంబళ్లపల్లె, నవంబరు 3, ప్రభాతవార్త:**
తంబళ్లపల్లె మండల కకేంద్రం సమీపంలోని మల్లయ్యకొండలో వెలసిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి లక్షలాది మంది భక్తులకు ఆరాధ్యదైవం. ఆ దేవదేవుని సేవ చేయడానికి తమకు నచ్చిన విధంగా సేవ చేసి ఆయన ఆశీర్వాదం పొందారు. ఇదే స్ఫూర్తితో ఈ మధ్య కాలంలో మల్లయ్య కొండ మహాశివుని ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున చెత్తా చెదారం పేరుకుపోయింది. తంబళ్లపల్లె నియోజకవర్గం కేంద్రం ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు రమేష్‌లో మానవత్వం పరిమళించింది. మల్లయ్యకొండలో పారిశుద్ధ్యం చేపట్టడానికి తన వంతు సహకారానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం ఆయన పలువురు కూలీలను ఏర్పాటు చేసి ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాల్లోని చెత్తా చెదారాలు, పిచ్చి మొక్కలు తొలగించి తన వంతు సహకారం అందించారు. మల్లయ్యకొండ పారిశుద్ధ్యంపై సహకరించి స్ఫూర్తిగా నిలిచిన క్షేత్ర సహాయకుడు రమేష్‌ను దేవాదాయశాఖ ఈవో మునిరాజా, రికార్డు అసిస్టెంట్ కొండకిట్ట, ఏపీవో అంజనప్ప, ఈసీ రామన్న, ఆలయ అర్చకులు ఈశ్వరప్ప, మల్లికార్జున, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

## భారీ వర్షానికి నిండిన గుండ్లపల్లి పాత చెరువు



**తంబళ్లపల్లె, నవంబరు 3, ప్రభాతవార్త:**
తంబళ్లపల్లె మండలం గుండ్లపల్లె పంచాయతీలోని గుండ్లపల్లి పాత చెరువు గత వర్షాలకు నిండి మొరవపోయింది. చెరువు నిండడంతో ఆయకట్టులోని సుమారు వంద ఎకరాలకు పైగా ఖరీఫ్ వరి సాగు అవుతోందని స్థానిక రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పాత చెరువు నిండడంతో సర్పంచ్ మౌలాలి ఆధ్వర్యంలో ఆదివారం ఆయకట్టులోని రైతులు చెరువు కట్ట మీద గంగమ్మకు పెద్దఎత్తున ఊరేగింపుగా థిల్లు బోనాలు సమర్పణతో పాటు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆయకట్టులోని రైతులు సాగు నీటిని సద్వినియోగం చేసుకొని ఖరీఫ్ వరి సాగు చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సర్పంచ్ మౌలాలి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ తంబళ్లపల్లె నియోజకవర్గ నేత వేట మల్లికార్జున, గుండ్లపల్లి చెరువు ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

## మహా శివునికి కార్తీక పౌర్ణమి దీపోత్సవం

**తంబళ్లపల్లె, నవంబరు 3, ప్రభాతవార్త:**



తంబళ్లపల్లె మండల కేంద్రం సమీపంలోని శ్రీభ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో మహాశివునికి కార్తీక మాసం దీపోత్సవం కార్యక్రమాన్ని మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం భక్తులు మహాశివునికి ప్రత్యేక పుష్పాలంకరణ, అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా ఆలయంలోని వీరభద్ర స్వామి, వినాయక స్వామి, గౌరీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి మహిళా భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఆలయ ఈవో మునిరాజా, రికార్డు అసిస్టెంట్ కొండకిట్టలు భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

## బహుజన సమాజ్ పార్టీ అన్నమయ్య జిల్లా కమిటీ ఎంపిక



**రాయచోటి, నవంబరు 3, ప్రభాతవార్త:**
అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షులు అబ్బవరం యుగంధర్ అధ్యక్షతన రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్‌కుమార్ నూతన జిల్లా కమిటీని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కచ్చితంగా మన బహుజన సమాజ్ పార్టీ సత్తాను చూపించి జిల్లా వ్యాప్తంగా అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలని జిల్లా కమిటీలోని సభ్యులందరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని కార్యకర్తలను ఆదేశించారు. అనంతరం నూతన జిల్లా కమిటీ సభ్యులుగా జిల్లా అధ్యక్షుడు యుగంధర్, జిల్లా ఇన్‌ఛార్జి బాలాజీ, జిల్లా ట్రెజరర్ గంగాధర్, సెక్రటరీ మహేష్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివకుమార్‌లను ఎంపిక చేశారు. జిల్లా కమిటీ మొత్తం సమర్థవంతంగా పనిచేసి ఆరు నియోజకవర్గాల కమిటీలను తక్షణం పూర్తి చేసి అన్నమయ్య జిల్లాలో పార్టీని బలోపేతం చేయాల్సిందిగా కోరారు.

## మంత్రి నాదెండ్ల మనోహర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అతికారి దినేష్

**సిద్దవటం, నవంబరు 3, ప్రభాతవార్త:**



ఏపీ పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఆదివారం రేణిగుంట విమానాశ్రయంలో రాజంపేట జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి దినేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజంపేట నియోజకవర్గ సమస్యల గురించి, పార్టీ కార్యక్రమాల గురించి, అభివృద్ధి గురించి మనోహర్‌కు తెలిపారు. మంత్రికి ప్రముఖ పుణ్యక్షేత్రం నందలూరు శ్రీసౌమ్యనాథ స్వామి చిత్రపటాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజంపేట నియోజకవర్గ జనసేన నాయకులు కొట్టే శ్రీహరి, మస్తాన్ రాయల్ పాల్గొన్నారు.

## శ్రీదేవి ఆసుపత్రిలో 9న ఉచిత వైద్యశిబిరం

**మదనపల్లె, నవంబర్ 3 ప్రభాతవార్త :**
పట్టణంలోని సొసైటి కాలనీలో ఉన్న శ్రీదేవి ఆసుపత్రిలో ఈనెల 9, 10వ తేదీల్లో ఉచిత సంతాన సాఫల్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ సంహిత మొటూరి తెలిపారు. ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ చెన్నైలోని ఫర్టిలిటి సెంటర్, శ్రీదేవి ఆసుపత్రి యాజమాన్యం సంయుక్తంగా ఈ ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంతానం లేని దంపతులకు ఉచితంగా స్కానింగ్, వీర్య పరీక్షలు, కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ టెక్నాలజీతో అనుభవం ఉన్న స్పెషలిస్టులు, డాక్టర్లు ఈ వైద్యశిబిరానికి హాజరవుతున్నట్లు తెలిపారు. సంతానం లేని దంపతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9639140686 సెల్‌నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## మదనపల్లె ఎంపిడిఓ తాజ్‌మస్రూర్

**మదనపల్లె, నవంబర్ 3 ప్రభాతవార్త:**



మదనపల్లె ఎంపిడిఓగా షేక్ తాజ్‌మస్రూర్ నియామకం అయ్యారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎంపిడిఓ భానుప్రసాద్ రామసముద్రంకు బదిలీ కావడంతో వారం రోజుల ఇన్‌చార్జ్ ఎంపిడిఓ మస్తాన్‌వల్లి నియామకం అయ్యారు. అనంతరం రెండురోజుల క్రితం చిత్తూరుజిల్లాలోని గుడిపల్లెలో ఎంపిడిఓగా ఉన్న తాజ్‌మస్రూర్‌ను మదనపల్లె ఎంపిడిఓగా నియమాకం చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ మండలంలో ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొంటానన్నారు. అదే విధంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచనల మేరకు అభివృద్ధి పనుల వేగవంతానికి ప్రత్యేక చొరవ చూపుతామన్నారు.

## ఆర్‌సి కురవపల్లె, ముదివేడు బస్సు సర్వీసు ప్రారంభం

**మాజీ సర్పంచ్‌ను ప్రశంసించిన గ్రామస్థులు**



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న దృశ్యం

**మదనపల్లెక్రైం, నవంబర్ 3 ప్రభాతవార్త :**
మదనపల్లె నుండి సిటిఎం, ఆర్‌సి కురవపల్లె మీదుగా ముదివేడు వరకు నూతన బస్సు సర్వీసును ఆదివారం ఉదయం తంబళ్లపల్లె టిడిపి ఇన్‌చార్జ్ దాసరిపల్లె జయచంద్రారెడ్డి ప్రారంభించారు. గతంలో ఈ సర్వీసును ఆపివేశారు. ప్రజలు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ఈ నేపథ్యంలో ఆ గ్రామ టిడిపి నాయకుడు, మాజీ సర్పంచ్ రుద్రా బాలక్రిష్ణ చొరవ చూపి టిడిపి ఇన్‌చార్జ్‌తో చర్చించారు. అనంతరం రవాణాశాఖామంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డిని కలసి వారు విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించారు. మదనపల్లె నుంచి సిటిఎం, ఆర్‌సి కురవపల్లె, కడప క్రాస్, ముదివేడు గ్రామాలు మీదుగా తంబళ్లపల్లె వరకు ప్రారంభించారు. ఇదే సర్వీసు కోనంగివారిపల్లె వరకు కూడా పొడిగించడంతో సుమారు 30గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రుద్రా బాలక్రిష్ణ, మాజీ ఎంపిటిసి చామంచి రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

## తమిళనాడు కంపెనీతో ఎంఓయు

**మదనపల్లెక్రైం, నవంబర్ 3 ప్రభాతవార్త :**



ఎంఓయుపై మార్చుకొంటున్న దృశ్యం

తమిళనాడు కంపెనీతో మిట్స్ కళాశాల అవగాహన ఒప్పందం కుదుర్చుకొన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. తమిళనాడులోని ఆల్గెన్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేటు కంపెనీతో మిట్స్ కళాశాల ఒప్పందం కుదుర్చుకోవడంతో విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య అంతరాయం తగ్గించడం, విద్యార్థులను ఆశ్యర్యాత్మక నైపుణ్యాలతో పరిశోదన కార్యక్రమాలను పెంపొందించుకోవడం ఇందులో ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. మిట్స్ ఆల్గెన్ కంపెనీలు ఉమ్మడి పరిశోదన ప్రాజెక్టులను అన్వేషిస్తాయని వినూత్నమైన స్థిరమైన అభివృద్ధికి దోహదపడుతాయని విద్యా అనుభవాలను మెరుగుపరుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొపెసర్ ఏవి.ప్రవీణ్‌కుమార్, శ్రీమతి చిత్రలు ఎంఓయులపై సంతకాలు చేసి ఒప్పందాలు కుదుర్చుకొన్నాయి.

## ప్రభుత్వ పాఠశాలలను బతికించుకుందాం

**మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం**



యూటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలో విఠపుబాల సుబ్రమణ్యం

**మదనపల్లెక్రైం, నవంబర్ 3 ప్రభాతవార్త :**
పాలకుల విధి విధానాల వల్ల ప్రభుత్వ బడి నిర్వీర్యం అవుతుందని దీన్ని కాపాడుకోవడానికి యూటిఎఫ్ నిరంతరం కృషి చేయాలని కౌన్సిల్ మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అన్నమయ్య జిల్లా యూటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ నిర్వహించారు. ఈ సభకు విఠపు బాల సుబ్రమణ్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సభలో బాల సుబ్రమణ్యం మాట్లాడుతూ కార్పోరేట్ అనుకూల విధానాలు కారణంగనా పేద ప్రజలకు చదువులు దూరం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. యూటిఎఫ్ 50ఏళ్ళ పూర్తిచేసుకొందన్నారు. రాష్ట్ర అధ్యక్షులు హరిప్రసాద్ మాట్లాడుతూ కార్పోరేట్‌కు అనుకూలంగా ప్రభుత్వాలు పనిచేస్తూ ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రయోజనాలను కాలరాస్తొందని దుయ్యబట్టారు. 13వ పిఆర్‌సి ఊసే ఎత్తడం లేదన్నారు. రాష్ట్ర కార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులు, పన్షనర్లతో ఏర్పడిన అసంబద్ధతను తొలగించడంతో పాటు వెంటనే ప్రమోషన్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్కూల్ అసిస్టెంట్లకు జేఎల్ ప్రమోషన్లు ఇవ్వాలని, పదవివిరమణ కారణంగా ఖాళీ అయిన పోస్టులను భర్తీ చేయడంతో పాటు ప్రధానోపాధ్యాయ పోస్టులను ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ స్వర్ణోత్సవ మహాసభకు రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజు, శ్రీనివాసులురెడ్డి, గౌరవ అధ్యక్షులు సుధాకర్ నాయుడు, హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి బాబీర్, సహాధ్యక్షులు హేమలత, చంద్రశేఖర్, పురం వెంకటరమణ, సురేంద్రరెడ్డి, రమణమూర్తి, ఆదినారాయణ, భాస్కర్‌రెడ్డి, సుధాకర్, అక్రంబాష, దావుద్దీన్, శ్రీనివాసులు, అంజాద్, వెంకటయ్య, హరిక్రష్ణ, శీనప్ప, జిల్లా యూటిఎఫ్ కేడర్ పాల్గొన్నారు.

## యువకుడు మృతి



**పులివెందుల, నవంబరు 3, ప్రభాతవార్త :**
పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లె రోడ్డు శేషారెడ్డి స్కూల్ సమీపంలోని రేకుల షెడ్డులో నివాసం ఉంటున్న బాబుల్‌రెడ్డి (35) జీవితం మీద విరక్తి చెంది ఆదివారం ఉదయం ట్యాంకు పైనుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బంధువుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం వెన్నపూసపల్లె గ్రామానికి చెందిన బాబుల్‌రెడ్డికి తల్లి దండ్రులు చనిపోవడంతో మేనత్త అయిన లక్ష్మమ్మ దగ్గరే ఉంటున్నాడు. కొన్నేళ్ల కిందటే తల్లిదండ్రులు చనిపోవడంతో బాబుల్‌రెడ్డికి మతిస్థితిమితం సరిగా లేక మానసికంగా ఇబ్బంది పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం పులివెందులలోని రంగనాథస్వామి ఆలయం సమీపంలో ఉన్న నీటి ట్యాంకు ఎక్కి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు వారు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై విష్ణు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పులివెందుల సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## భారతదేశంలో స్టార్టప్ రంగంలో కొత్త అధ్యాయం భాస్కర్ ప్లాట్‌ఫాం

**- పులివెందుల వాసి ఘనత**

**పులివెందుల, నవంబరు 3, ప్రభాతవార్త :**



భారతదేశంలో స్టార్టప్‌లకు నూతన వేదికగా రూపుదిద్దుకుంటున్న భాస్కర్ వేదికను స్టార్టప్ ఆఫ్ ఇండియా (భారత స్టార్టప్ పరిజ్ఞాన ప్రాప్యత రిజిస్ట్రీ) ప్రారంభించారు. భాస్కర్ వేదిక రూపకల్పనకు, ప్రణాళికకు కడప జిల్లాలోని పులిఎందులకు చెందిన అల్లం భాస్కర్‌రామ్ స్థాపించిన కెర్డోస్ ఇన్‌స్ట్రాసాఫ్ట్ అనే సంస్థ కృషి చేసింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ కంపెనీ కేరడోస్ సంస్థ జనరల్ మేనేజరు అల్లం భాస్కర్‌రామ్, డైరెక్టరు రాజేష్‌లు తమ ఆలోచనలను, ప్రణాళికలను పంపించారు. ఇందుకు స్పందించిన గవర్నమెంట్ ఆఫ్ ఇండియా స్టార్టప్ ఇండియా వారు వెంటనే భాస్కర్ వేదిక ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వేదికకకు కేరడోస్ సంస్థ జనరల్ మేనేజరు భాస్కర్‌రామ్ పేరులోని భాస్కర్‌ను తీసుకోవడం విశేషం. ఈ వేదిక ద్వారా పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులు, మార్గదర్శకులు, విధాన నిర్ణేతలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ స్టార్టప్‌లకు మార్కెట్ల పెద్ద అవకాశాలు, నూతన మార్గదర్శకాలు అందించే విధంగా డిజైన్ చేయబడింది. ఈ మేరకు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ ఒక ప్రశంసాపత్రాన్ని కూడా కెరడోస్ సంస్థ ప్రతినిధులకు పంపించారు. కెర్డోస్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సాంకేతికత, ఆవిష్కరణల్లో ప్రత్యేకంగా పని చేస్తున్న సంస్థగా, ప్రధానంగా ఓపెన్‌సోర్స్ సాఫ్ట్‌వేర్‌ల అభివృద్ధి, వాటికి మద్దతు అందించడంలో కృషి చేస్తూ ఉంది. బ్లాక్‌చైన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మిషన్ లెర్నింగ్, ఫుల్‌స్టాక్ వెబ్ డెవలప్‌మెంట్ వంటి అత్యాధునిక సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చేయడం ఈ సంస్థ యొక్క ప్రధాన లక్ష్యం. భారతదేశ ఆవిష్కరణల భవిష్యత్తును అభివృద్ధి చేయడంలో భాగస్వాములు కావాలని భాస్కర్ ద్వారా కనెక్ట్ అయి, క్రమంగా నూతన స్టార్టప్‌లు ఎదగాలని కెరడోస్ సంస్థ ప్రతినిధులు అల్లం భాస్కర్, రాజేష్‌లను కోరుతున్నారు.

## జీతాలు ఆలస్యం..

## ఉపాధ్యాయులకే ఎందుకు?

**- ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి**



**వేంపల్లె, నవంబరు 3, ప్రభాతవార్త :**
ఉపాధ్యాయుల జీతభత్యాల చెల్లింపు అన్ని విభాగాల ఉద్యోగులతో సమానంగా ఒకే సమయంలో జరగాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఉదయం వేంపల్లె ఎస్టీయూ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా జీతాల చెల్లింపు విధానంలో ముందుగా ప్రభుత్వంలోని అన్ని విభాగాలకు జీతాలు చెల్లించిన తరువాతనే ఉపాధ్యాయులకు సంబంధించిన జీతాలు చెల్లింపు ప్రక్రియ చేపడుతోందన్నారు. ఇది సరైన విధానం కాదని, గత ప్రభుత్వం కూడా ఇలాగే ఉపాధ్యాయులకు అందరికీ జీతాలు చెల్లించిన తరువాత జీతాలు చెల్లించేదని, ఉపాధ్యాయులు, రెండవశ్రేణి ఉద్యోగులు కాదని గుర్తు ఎరగాలని, అందరితోపాటు సమానంగా ఉపాధ్యాయుల జీతాలను కూడా చెల్లించేలా విధానాన్ని మార్చుకోవాలని ప్రభుత్వానికి ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి సూచించారు. 2018, 2019లకు సంబంధించిన డీఏ అరియర్లు, సీపీఎస్ వారికి క్యాష్ రూపంలో చెల్లించాల్సి ఉండగా ఆ సంగతి మరిచిపోయారని. ఈ ప్రభుత్వమైనా ఉద్యోగుల సంక్షేమాన్ని మరవకుండా ఉద్యోగులకు చెల్లించాల్సిన పాత బకాయిలన్నీ వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. 12వ పీఆర్సీకి సంబంధించిన మధ్యంతర భృతిని రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా సంఘాలతో చర్చించి ప్రకటించాల్సిన పరిస్థితి నేడు నెలకొందన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు 11వ పీఆర్సీ రూపంలో రివర్స్‌లో చేదు గుళిక అందిందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని 12వ పీఆర్సీ విషయంలో ఈ ప్రభుత్వం రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని రఘునాథరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంభం బాల గంగిరెడ్డి, కడప జిల్లా ప్రధాన కార్యదర్శి నర్రెడ్డి సంగమేశ్వర్‌రెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి, రాష్ట్ర కమిటి కన్వీనరు శివారెడ్డి, రీజియన్ కన్వీనరు ప్రతాపరెడ్డి, కార్యకర్తలు రమణారెడ్డి, శివశంకర్‌రెడ్డి, పీసీ బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గోపవరం వాసి మృతి

**గోపవరం,నవంబర్ 3 (ప్రభాతవార్త):**



గోపవరం మండలం పెద్దగోపవరం గ్రామానికి చెందిన కోడూరు చెన్నకేశవ (26) అన్నమయ్య జిల్లా సంబేపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో జరిగినట్లు తెలుస్తోంది. వృత్తిరీత్యా చెన్నకేశవ బద్వేలులోని కృష్ణా కాంప్లెక్స్‌లో ఓ బార్బర్ షాపులో పనిచేస్తున్నారు.మృతుడు పీలేరులోని బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా బొలేరో వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. మృతునికి భార్య, ఆరు నెలల పాప, మతిస్థిమితం లేని అన్న ఉన్నారు.

## ఆస్తికోసం ఇంట్లోనుంచి అత్తను గెంటేసిన కోడలు

**బద్వేలు , నవంబర్ 3 (ప్రభాతవార్త):**



మున్సిపాలిటీ పరిధిలోని చౌ డమ్మ వీధిలో ఆస్తికోసం కట్టు కున్న భర్తను, అత్తను కోడలు శ్యామలాదేవి బయటకు గెంటే సింది. అత్త వెంకటలక్షుమ్మ తె లిపిన వివరాల మేరకు తన భర్త అంకయ్యను గతంలో ఆస్తి కోసం కోడలు శ్యామలా దేవి, తనబంధువులతో కలిసి దాడి చేసిందని ఆ సమయంలో తీ వ్రంగా గాయపడిన నా భర్త మరణించారని, ఈ విషయమై పలుమార్లు పోలీ సుస్టేషన్‌కు వెళ్లినా తనకు న్యాయం జరగలేదన్నారు. అలాగే తనతో పాటు కట్టుకున్న భర్త అయిన తన కుమారుడు నాగరాజు కూడా లెక్క చేయకుండా ఇంట్లోకి రానివ్వకుండా బయటకు గెంటేసిందన్నారు. తమకు సంబంధిత శాఖా ధికారులు న్యాయం చేయాలని తల్లి, కుమారులు కోరారు.

## అత్తిరాలలో భారీ వర్షం

**రాజంపేట అర్బన్, అక్టోబర్ 03, ప్రభాతవార్త:**



పవిత్ర పుణ్యక్షేత్రమైన అత్తిరాలలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. అల్పపీడన ప్రభావంతో అత్తిరాలలో, పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో గ్రామంలో నీటి ప్రవాహం కనిపించింది. అలాగే అత్తిరాల వంక కూడ ప్రవహించింది. రాజంపేట పట్టణంలో ఒక మోస్తరు వర్షం కురిసింది. వాతావరణం మేఘావృతమైంది.

## ప్రజాదర్బార్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



**చిన్నమండెం,నవంబర్ 03, ప్రభాతవార్త:**
ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి వివిధ శాఖల అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలో మంత్రి నివాసం నందు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు అక్కడిక్కడే పరిష్కరించడం జరుగుతుందన్నారు. వివిధ శాఖల అధికారులు ప్రజాదర్బార్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి ప్రజాదర్బార్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని సమస్యల అర్జీలను సమర్పించారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని మంత్రి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## మదనపల్లె గ్రీన్ సిటీగా అభివృద్ధికి చర్యలు

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే

**మదనపల్లె, నవంబర్ 3 ప్రభాతవార్త :**
రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్న మదనపల్లెను గ్రీన్ సిటిగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఆదివారం పట్టణంలోని క్రిష్ణానగర్‌లో న్యాయవాది బాలజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించగా జన జాగృతి సేవా సమితి లోగో ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటివద్ద మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మొక్కలను విరివిగా పెంచితే కాలుష్య నియంత్రణతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించవచ్చునన్నారు. అంతేకాకుండా పట్టణానికి ఐటి కంపెనీలు తీసుకువచ్చి నిరుద్యోగ సమస్యనుకూడా తీరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోర్డు స్వచ్ఛందసంస్థ సిఈఓ లలితమ్మ, హెడ్‌కానిస్టేబుల్ రామ్మూర్తి, చైతన్యసంస్థ ఆనందబాబు, జనసేన నాయకురాలు దారం అనిత, జేసిబి వేణు, మదుసూదన్‌రెడ్డి, వెంకటేష్, గురుయాదవ్, టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## మదనపల్లెలో టమోటా కిలో రూ.36లు

**మదనపల్లె, నవంబర్ 3 ప్రభాతవార్త :**



మదనపల్లె టమోటా మార్కెట్‌యార్డులో టమోటా ధరలు గత నాలుగు రోజులుగా పెరిగాయి. ఆదివారం మార్కెట్‌యార్డులో ఒకటవ రకం టమోటా కిలో రూ.36లు ధర పలికింది. రెండవరకం కిలో రూ.26లు ధర పలికింది. ఇన్నాళ్ళు ధరలు లేక నష్టాలు చవిచూసిన రైతాంగానికి గత వారం రోజులుగా ధరలు పెరగడంతో రైతులు కాస్త ఊరట చెందుతున్నారు. భయట ప్రాంతాల్లో టమోటాకు డిమాండ్ ఉండడం వల్లే ధరలు పెరిగాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. మార్కెట్‌యార్డుకు సాధారణంగా టమోటాలు 500నుంచి 600 మెట్రిల్ టన్నుల వరకు వచ్చేవి. అలాంటివి ప్రస్తుతం మార్కెట్‌కు 173మెట్రిక్ టన్నులు మాత్రమే రావడం వల్ల టమోటాకు డిమాండ్ వచ్చిందంటూ పలువురు చెబుతున్నారు. ఇంకా ధరలు పెరిగే అవకాశం ఉందని వ్యాపారస్తులు చెబుతున్నారు. టమోటా మార్కెట్ యార్డు వ్యాపారా లావాదేవీలకు రాష్ట్రంలోనే పేరు పొందింది. ఇక్కడ నుంచి టమోటాలు తమిళనాడు, ఒడిస్సా, కర్నాటక, తెలంగాణ, మహారాష్ట్రలతో పాటు ప్రధాన నగరాలకు ఎగుమతి అవుతాయి. మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో రైతులు టమోటాను జీవనాధారపంటగా సాగు చేస్తారు.

## కమలాపురం నియోజకవర్గాన్ని కరవు ప్రాంతంగా ప్రకటించాలి

- కమలాపురం వైసీపీ నాయకుడు సాయినాథ్‌శర్మ డిమాండ్



**కమలాపురం, నవంబరు 3, ప్రభాతవార్త:**
కరవుకు శాశ్వత నిలయమైన కమలాపురం నియోజకవర్గాన్ని కరవు ప్రాంతంగా ప్రకటించాలని వైసీపీ రాష్ట్ర నాయకుడు కాశీభట్ల సత్య సాయినాథ్‌శర్మ డిమాండ్ చేశారు. కమలాపురంలో ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అతివృష్టి అనావృష్టి కారణంగా కమలాపురం నియోజకవర్గంలోని రైతాంగం పంటలు చేతికి రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ కమలాపురం నియోజకవర్గాన్ని కరవు ప్రాంతంగా ప్రకటించకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కరువు మండల జాబితాలో కమలాపురం నియోజకవర్గంలోని ఆరు మండలాలు లేకపోవడం రైతులకు తీరని అన్యాయమన్నారు. కమలాపురం నియోజకవర్గంలో 70% పైగా రైతులు వర్షాధారం పంటలు సాగు చేస్తుంటారన్నారు. అధిక శాతం మెట్ట భూమి ఉండడంతో రైతులు వర్షాల మీద ఆధారపడి జీవిస్తున్నారన్నారు. గత ఏడాదివర్షాలు లేక పంటలు చేతికి రాక రైతులు అప్పులపాలై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ అధికారులు కమలాపురం ప్రాంతం రైతుల సమస్యలను గుర్తించకపోవడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. రైతు సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా చెప్పుకు ప్రభుత్వం కమలాపురం నియోజకవర్గ రైతాంగానికి ఇంతటి అన్యాయం చేయడం రైతులకు ద్రోహం చేసినట్లే అన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. సరైన సమయంలో వర్షాలు రాక పంటలు చేతికొచ్చే సమయంలో అధిక వర్షాలతో మరికొన్ని చోట్ల రైతులు నష్టపోతూనే ఉన్నారన్నారు. అనుభవం ఉన్న రైతులతో కమిటీ వేసి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఉల్లి రైతులకు తక్షణమే నష్టపరిహారం భారీగా చెల్లించాలని ఆయన కోరారు. రైతులు పడుతున్న ఇబ్బందులను వ్యవసాయ శాఖాధికారులు గుర్తించకపోవడం శోచనీయమన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి కూడా తాము వినతిపత్రం పంపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రాప్ విధానం ద్వారా రైతులకు భారీగా నష్టం జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రిగా సుధీర్ఘ అనుభవం ఉన్న చంద్రబాబునాయుడు కమలాపురం నియోజకవర్గ రైతాంగ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ఆయన కోరారు.

## ఇన్‌చార్జి మంత్రికి సమస్యల హారతి పట్టిన సుగవాసి

**రాజంపేట,నవంబర్ 03,ప్రభాత వార్త :**



అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి మంత్రి బిసి జనార్ధన్ రెడ్డికి రాజంపేట తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం ఆదివారం సమస్యల పత్రాన్ని హారతి పట్టి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మంత్రితో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో రాజంపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఓడిపోవడం దురదృష్టకరం అన్నారు. దీంతో నియోజకవర్గంలో సమస్యలు తిష్ట వేసి కూర్చొన్నాయన్నారు. నియోజకవర్గం అభివృద్ధి పథంలో అన్ని రంగాల్లో వెనుకబడి ఉందన్నారు. తాను అభివృద్ధి కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ సొంత పార్టీలోనే అనేక దుష్ట శక్తులు అడ్డుపడుతున్నాయన్నారు. రాజంపేటలోని రోడ్ల పరిస్థితి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. పట్టణంలో రోడ్డు వెడల్పు చేయకపోవడంతో వాహనాల రద్దీ అధికంగా ఏర్పడి ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. రోడ్డు వెడల్పుకు సహకరించాలని కోరారు. కడప నుంచి రేణిగుంటకు 6లైన్ల రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమై ఆగిపోయాయన్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి పనులు కూడా అర్ధాంతరంగా ఆపేశారన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకొని పోయి సుమారు 40 మందికి పైగా ప్రాణాలు కోల్పోయి వందలాది పాడి పశువులు కూడా నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణానికి కూడా తమ వంతు కృషి చేయాలని మంత్రిని కోరారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ బాబులు గతంలో రాజంపేటకు ఎంతో అన్యాయం జరిగిందని దీన్ని సరిచేసేందుకు రాజంపేటను జిల్లా కేంద్రంగా చేస్తానని ఇచ్చిన హామీ పట్ల కూడా ప్రత్యేక శ్రద్ద చూపాలని కోరారు. ఉద్యాన వన పంటలు ఎక్కువగా ఉండే రాజంపేటలో ఎటువంటి వ్యవసాయ అనుభంద పరిశ్రమలు లేవన్నారు. పండించిన పంటలు నిలువ ఉంచేందుకు శీతల గిడ్డంగి కూడా ఏర్పాటు చేయించాలని కోరారు. రాజంపేట నియోజకవర్గంలోని అనేక సమస్యలను మంత్రికి వివరించి వినతి పత్రాన్ని అందజేశారు.

## ముళ్లకంప చెట్లుతో పచ్చగా మారిన పశువైద్యశాల





**మైదుకూరు,నవంబర్ 03,ప్రభాతవార్త:**
కడప జిల్లా మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రొద్దుటూరు రోడ్డు ప్రధాన రహదారి పక్కన ఉన్న పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుల వారి కార్యాలయం ప్రాంతీయ పశు వైద్యశాల ఆవరణంలో నూతన భవనం ఏర్పాటు చేయకముందు పాత భవనంలో పశు వైద్యశాల నడిచేది అనంతరం నూతన భవనంలోకి మారిన తర్వాత పాత భవనాన్ని అలాగే వదిలేయడంతో ముళ్లకంప చెట్లతో తీగలా అల్లుకపోయి పచ్చగా అడవిల తయారైనది. నిత్యం పశువుల వైద్యం కోసం వచ్చే పాడి రైతులు, పశువుల యజమానులు పట్టుకొని కొంత సేపు ఉండడానికి స్థలం లేక ఇబ్బందులు ఉన్నాయి. అంతేకాకుండా గతంలో కొత్త భవనం వెనుక భాగాన కొంత స్థలాన్ని ఆక్రమించి రాళ్లతో బేస్ మట్టం వేసిన స్థలంపై గతంలో అభ్యంతరాలు కూడా ఉన్నాయి.ఆ స్థలాన్ని ఇప్పటికీ అలాగే వదిలేశారు. ఇప్పుడైనా ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి పశు వైద్యశాల స్థలాన్ని పరిశుభ్రత చేసి ఇతర అవసరాలకు పాడి రైతులకు,పశువుల యజమానులకు ఉపయోగపడేలా పరిశుభ్రంగా ఉంచగలిగితే భావితరాలకు ఉపయోగపడే అవకాశాలు ఉన్నాయి ఆక్రమణకు గురైన స్థలాన్ని గుర్తించి చుట్టూ ప్రహరీ నిర్మించినట్లయితే పాడి రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

## ముళ్ల పొదలను శుభ్రం చేసిన పోలీసులు




**గోపవరం,నవంబర్ 3 (ప్రభాతవార్త):**
మండలంలోని శ్రీనివాసపురం వద్ద బద్వేలు, నెల్లూరు రహదారిపై ఉన్న బస్టాండును దాదాపు 15 సంవత్సరాల క్రితం నిర్మించారు. గత కొన్నేళ్లుగా ఈ బస్టాండు వినియోగం లేకపోవడంతో అక్కడ అధికంగా ముళ్లపొదలు పెరిగాయి. దీంతో అసాంఘీక కార్యక్రమాలకు, మద్యపానానికి, తదితర వ్యసనాలకుఈ బస్టాండు అడ్డాగా మారింది. దీంతో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు రూరల్ సీఐ నాగభూషణంఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీకాంత్ , పోలీసు సిబ్బంది జేసీబీతో ముళ్ల పొదలను తొలగించడం బస్టాండు ఆవరణమంతాసుందరంగా తయారైంది. దీంతో ఎన్నో ఏళ్లుగా అక్కడ ఏపుగా ఉన్న ముళ్ల పొదలు పెరగడంతో అక్కడ బస్టాండు ఉందనే విషయం మరిచిన స్థానికులకు పోలీసులు చొరవతో వాటిని తొలగించడంతో అక్కడి వాతావరణం పూర్తిగామారిపో యింది. దీంతో పలువురు ప్రజలు పోలీసులను అభినందించారు.

## ఎన్నికల హామీలు అమలు పరచడంలో కూటమి ప్రభుత్వం విఫలం



**ప్రొద్దుటూరు, నవంబర్ 03, ప్రభాతవార్త:**
గత సార్వత్రిక ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు నర్రెడ్డి తులసీరెడ్డి విమర్శించారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని దీపావళి నుండి అమలు చేయడం హర్షనీయం అన్నారు. ఈ ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అందరికి అమలు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వ మేనిఫెస్టోలో చెప్పినట్లు ప్రతి ఇంటికి ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా సరఫరా చేయడం లేదని రాష్ట్రంలో 180లక్షల కుటుంబాలకు 154 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. అందులో కోటి గ్యాస్ కనెక్షన్లకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని 54లక్షల కుటుంబాలు అనర్హులుగా ఉన్నారన్నారు. ఎలాంటి షరతులు లేకుండా ప్రతి ఇంటికి గ్యాస్ సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. అధికారం చేపట్టి ఐదు నెలలు కావస్తున్న మేనిఫెస్టోలో చెప్పిన విధంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని వెంటనే అమలు చేయాలని అన్నారు. విద్యా సంవత్సరం సగం పూర్తయిన ఇంతవరకు అతీగతీలుదని విమర్శించారు. కూటమి ప్రభుత్వాలకం చూస్తుంటే తల్లికి వందనం నిల్ తండ్రికి ఇంధనం ఫుల్ అన్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు 20,000ఇస్తామన్న హామీ ఖరీఫ్ సీజన్ ముగిసిన 20పైసలు కూడ ఇవ్వలేదని విమర్శించారు. అన్నదాత సుఖీభవ పథకం తీరా దు:ఖీభవ పథకంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై 6073కోట్లు అదనపు భారం మోపడం శోచనీయమని అన్నారు. అదే ధోరణి మాని ఎన్నికల సంధర్భంగా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని కరెంటు సర్దుబాటు చార్జీలు ఉపసంహరించుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త షేక్ పూల నజీర్ ఆహ్మద్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అడ్వకేట్ జీలాని బాష మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసిపికి రెండు పంచాయితీలు క్లీన్ స్వీప్



**వీరబల్లి,నవంబర్03,ప్రభాతవార్త :**
అన్నమయ్య జిల్లాలోని వీరబల్లి మండలంలో రెండు పంచాయితీలకు చెందిన వైసిపి ప్రముఖ నాయకులు ఆదివారం తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ఆ రెండు పంచాయితీలు వైసీపీ పార్టీ క్లీన్ స్వీప్ అయింది. రాజంపేట ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం ప్రజల పట్ల చూపుతున్న విశ్వాసం, మమేకం మరియు అధికార పార్టీ అయిన తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన సూరప్ సిక్స్ పథకాల పట్ల ప్రజలే కాదు, వైసీపీ పార్టీకి చెందిన పంచాయితీ, మండల స్థాయి నాయకులు కూడా మొగ్గు చూపుతున్నారు. దీంతో ఆదివారం టిడిపి మండల నాయకుడు తాటిగుట్ల శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన, ఆ గ్రామాల ముఖ్య నాయకుడు మధుసూధన రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 300 మంది వైసిపిని వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆ గ్రామ నాయకుడు మధుసూదన రెడ్డి మాట్లాడుతూ ఇంతవరకు తమ గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోని టిడిపి ప్రభుత్వం సీయం చంద్రబాబు నాయుడు చేస్తున్న అభివృద్ధి చూసి ఆకర్షితులై టిడిపి తీర్థం పుచ్చుకున్నట్లు తెలిపారు. అనంతరం టిడిపి మండల నాయకుడు తాటిగుట్ల శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ వీరబల్లి మండలాన్ని టిడిపికి కంచుకోటగా చేయడమే తన ముందున్న లక్ష్యం అని తెలిపారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి లేక ప్రజలు నానా అవస్థలు పడ్డారన్నారు. ప్రస్తుతం ఆ బాధ తీరందన్నారు. ప్రతి గ్రామాన్ని బాగు చేయడమే ఆయన లక్ష్యం అన్నారు. ప్రజలు, నాయకులు అన్న తేడా లేకుండా అందరూ టిడిపి వైపే చేస్తున్నారన్నారు. అనంతరం రాజంపేట ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం అందరికి టిడిపి కండువాలు కప్పి పార్టీ లోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు ఆయనకు శాలవాలు కిప్పి జగమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సుగవాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రజలు, నాయకులు టిడిపి చేపట్టిన సూపర్ సిక్స్ పథకాలు చూసి ఒక్కొక్కరుగా పార్టీ తీర్థ పుచ్చుకోవడం మంచి తరుణం అన్నారు. ముఖ్యంగా ఈ మార్పు ఎన్నికల కంటే ముందు వచ్చి ఉంటే ఈ పాటికి రాజంపేట లో అభివృద్ధి పరుగులు పెట్టేదన్నారు. పార్టీలో చేరిన ముఖ్య నాయకులను దగ్గరుండి ఆయనకు మండల నాయకుడు శ్రీధర్ రెడ్డి, మధుసూధన రెడ్డిలు పరిచయం చేశారు. ఈ చేర్పులతో ఆ రెండు పంచాయితీలో టిడిపి క్లీన్ స్వీప్ చేస్తుందనే చెప్పవచ్చు. దీంతో వైసిపి నాయకులకు పెద్ద షాకే తగిలినట్లైంది. ఈ కార్యక్రమంలలో వంగిమళ్ల సర్పంచ్ సరస్వతమ్మ, ఎంపీటీసీ నాగులయ్య, మాజీ సర్పంచులు హఫీజుల్లా, షేక్ అహ్మద్ బాషా, మాజీ జెడ్పీటీసీ అన్నయ్య, మాజీ ఎంపీటీసీ జయచంద్రా రెడ్డి, బాబు రెడ్డి, వెంకట క్రిష్ణా రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, సతీష్, రమణ, డీలర్ బాబు రెడ్డి, ఆర్‌యంపి డాక్టర్ లక్ష్మీ శేఖర్ రెడ్డి కుర్దూస్ ఖాన్, బిసి సెల్ నాయకుడు తుమ్మల రమేష్, గడికోట టిడిపి నాయకుడు నాగూర్ రెడ్డి, పవన్ కుమార్, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ నాయుడు, జయచంద్రా రెడ్డి, రెండు గ్రామ పంచాయితీల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికి సబ్సిడి రుణాలు ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్ గొర్రెల మేకల పెంపకదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు డి.ఎం.ఓబులేసు యాదవ్



**కడప, నవంబర్ 03, ప్రభాతవార్త:**
రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ అర్హులందరికి సబ్సిడి రుణాలు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెల మేకల పెంపకదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు డి.ఎం ఓబులేసు యాదవ్ కోరారు. కడప కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ గొర్రెల మేకల పెంపకదారుల సమాఖ్య రాష్ట్ర కమిటీ సమావేశానికి పార్ల శ్రీనివాసులు యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సంధర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డి.ఎం ఓబులేసు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఏ ఒక్కరికి కూడ రుణాల మంజూరు చేసిన దాఖలాలు లేవన్నారు. గొర్రెల కాపరి దినదినగండంతో జీవనం సాగిస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బుర్రి రెడ్డయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి తెల్లదార్ల విజయ్‌కుమార్ యాదవ్, రాష్ట్రనాయకులు అయ్యావారయ్య యాదవ్, శ్రీనివాసులు యాదవ్, కృష్ణయ్య యాదవ్, వంశీ యాదవ్, ఓబులేసు యాదవ్, నాగమల్లయ్య యాదవ్, పుల్లయ్య యాదవ్, ఓబుళపతి యాదవ్, రాజశేఖర్ యాదవ్, ఉక్కాయపల్లి రాజా యాదవ్, కిరణ్‌యాదవ్, శరత్‌యాదవ్, వెంకటరమణ యాదవ్, వెంకట సుబ్బయ్య యాదవ్, నాగార్జున యాదవ్, జగన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ కోర్టు తీర్పే తుది తీర్పు

(ముంబై హైకోర్టు)

**బద్వేలు లీగల్, నవంబరు 03 ప్రభాతవార్త :**
ఏదైనా కేసుకు సంబంధించి బహిరంగ కోర్టులో వెలువడిన తీర్పే తుది తీర్పు అని, తీర్పు వెలువడిన తరువాత న్యాయాధికారి బదిలీ అనంతరం సంతకం జరిగినా ఆ తీర్పు చెల్లుబాటయ్యేదిగానే పరిగణించాల్సి వుంటుందని ముంబై హైకోర్టు తేల్చి చెప్పింది (సువర్ణ రత్నాకర్ తారస్ ఎదిరి మంగల్ ప్రభాత్ లోద అండ్ అదర్స్ (డబ్ల్యుపి నెం.7535 ఆఫ్ 2023) కేసులో హైకోర్టు ఈ తీర్పును ప్రకటించింది. బహిరంగ కోర్టులో ఒకసారి తీర్పు వెల్లడైన తరువాత ఆ తీర్పు ఎలా వెలవడిందనే అంశాన్ని తప్పు పట్టడానికి వీల్లేదని కోర్టు స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి గతంలో వినోద్ కుమార్ సింగ్ ఎదిరి బెనారస్ హిందూ యూనివర్సిటీ అండ్ అదర్స్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును హై కోర్టు ఈ సందర్భంగా ఉటంకించింది.

## ఏపీఎండీసీలో గ్రేడుల్లో

## తిరకాసేమిటి తిరుమలేశా..?

- లో గ్రేడ్ అనుమతి - హైగ్రేడ్ ఎగుమతి
- సెలవు రోజు అయినా జోరుగా ముగ్గురాయి సరఫరా లోడింగ్ పనులు
- సర్వత్రా విమర్శలు గుప్పిస్తున్న వైనం



**ఓబులవారిపల్లె, నవంబరు 3, ప్రభాతవార్త:**
ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మంగంపేట ఏపీఎండీసీ పరిధిలో బెరైటీస్ ఖనిజాల గ్రేడింగ్‌లో తారుమారు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. లో గ్రేడు అనుమతితో హై గ్రేడు ఎగుమతి చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. బెరైటీస్‌లో ఏబీసీడీ గ్రేడులు ప్రధానంగా ఉంటాయి. కెమికల్ గ్రేడు వీటికి అదనంగా గ్రావిటీ పరంగా కొనుగోలు దారులు ఏ గ్రేడుకు లేదా బి గ్రేడుకు అధిక ప్రాధాన్యత ఇచ్చి కొనుగోలుకు సిద్ధపడతారు. ఈ నేపథ్యంలో ఆదివారం సెలవు దినం అయినప్పటికీ శనివారం వరకు ఒక క్యాట్ లోడింగ్ ఉండేది. గ్రావిటీ బి గ్రేడ్ అయినప్పటికీ సి అండ్ డీ సీ గా చూపించి అధికంగా బి గ్రావిటి ఉన్న ఖనిజం డంపింగ్‌ను కొందరు ఎక్స్‌పోటర్లకు ఇక్కడ పనిచేస్తున్న సంస్థ అధికారులు లోపాయి కార ఒప్పందాలు కుదుర్చుకొని లోడింగ్ డిస్పాచ్ కాటా ఉద్యోగులకు ఒటీని అందజేసి లోడింగ్ పనులు ప్రారంభిస్తున్నారని తెలుస్తోంది. సందట్లో సడేమియా అన్నట్లు సీ గ్రేడు అనుమతి ఉన్నప్పటికీ గ్రావిటీ బి గ్రేడ్ ఉండి నాణ్యతగా ఉండడంతో ఎక్స్‌పోటర్లకు ఏ ప్రభుత్వం వచ్చినా వడ్డించేవాడు మావోడే అన్న చందంగా ఇక్కడ పనులు జోరుగా సాగుతున్నాయని ఆరోపణలు మిన్నంటుతున్నాయి. గత 20 సంవత్సరాలుగా ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులతో లోపాయికారి ఒప్పందాల వల్ల ఇదంతా జరుగుతున్నట్లు సమాచారం. సీ గ్రేడు రూ.2700 ఉన్నప్పటికీ బి గ్రేడు రూ.7000 ముగ్గురాయి ఉంది. సి గ్రేడు బదులు బి, ఏ గ్రేడు ముగ్గురాయి సరఫరా చేసి అందిన కాడికి దండుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత ఏపీఎండీసీ అధికారులు లోతైన విచారణ చేపట్టి గ్రేడుల్లో గందరగోళం జరగకుండా బయ్యర్లు రెస్పొటల్ కట్టిన రాయల్టీకే సరైన గ్రేడింగ్ రాయిని సరఫరా చేయించాలని ఆర్థిక విశ్లేషకులు కోరుతున్నారు. ఇన్‌ఛార్జి సీపీవో సాయని వివరణ కోరగా సెలవు దినం ఆదివారం డిస్పాచ్ లోడింగ్ ఎందుకు జరుగుతున్నదని అడగగా రెండు రోజుల క్రితం డీడీఎంఎస్ సమస్య వల్ల సరఫరా ఆగిందని ఈ రోజు సరఫరా చేస్తున్నామన్నారు. అలాగే సీ గ్రేడ్ బదులు ముగ్గురాయి బి గ్రేడు వేరే క్యాట్ నుంచి సరఫరా అవుతోందని సమాచారం అందిందని అడగగా గ్రేడుల్లో చూసి సరిగానే పంపిణీ చేస్తున్నామని ఆయన వివరించారు.



## మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం అభినందనీయం

**బద్వేలు అర్బన్, నవంబరు 3( ప్రభాతవార్త):**
డీవైఎఫ్ఐ ఆద్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని అర్బన్ సీఐ రాజగోపాల్ పేర్కొన్నారు. ఆదివారం డీవైఎఫ్ఐ ఆవిర్భవించి 44 సంవత్సరాలు కావడంతో ఈ సందర్భంగా పట్టణంలోని సుందరయ్య కాలనీలో 44 మొక్కలను నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్య వాతావరణాన్ని నియంత్రించేందుకు మొక్కలు ఎంతో అవసరమని ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజు నాడు ఒక్క మొక్కను నాటి సంరక్షించినట్లయితే అది మన భావితరాలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అలాగే విద్యార్థుల సమస్యలపై పోరాడడమే కాకుండా డీవైఎఫ్ఐ వారు ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం మంచి విషయమన్నారు. ముఖ్యంగా నేటి యువత డ్రగ్స్,గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని, వాటికి దూరంగా ఉంటూ సమాజసేవలో తమవంతు పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ్‌కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని,పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్ షరీఫ్, ఆదిల్, రూరల్ కార్యదర్శి బాలగురయ్య, మహిళా కో కన్వీనర్ ఫాతతిమా, నాగేశ్వరి, పట్టణ నాయకులు యువరాజ్, ఖలీల్, నాగేంద్ర, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నమయ్య జిల్లాకు విచ్చేసిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి

**రాయచోటి, నవంబరు 3, ప్రభాతవార్త:**
అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటికి ఆదివారం ఉదయం విచ్చేశారు. ఈ సందర్భంగా రవాణా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తదితర అధికారులు స్టేట్ గెస్ట్ హౌస్ నందు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం జిల్లాకు సంబంధించిన వివిధ విషయాలపై ఇన్‌ఛార్జి మంత్రి వారితో చర్చించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

**రాజంపేట,నవంబర్ 03,ప్రభాత వార్త :**
రాజంపేట మండలం రాయచోటి, రాజంపేట రోడ్డులోని కూచివారిపల్లె పాలకేంద్రం వద్ద ద్విచక్రవాహనం నుంచి క్రింద పడి యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటనలో ఉప్పరపల్లె గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి దొంతం వెంకటసుబ్బయ్య, మోటారు సైకిల్ నుంచి క్రింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం స్థానికులు పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్సలు చేయించారు.

